# ప్రభాత సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 5 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


### రియల్-టైమ్ షాపింగ్ కోసం ఏఐ- పవర్డ్ లెన్స్ లైవ్‌ను లాంచ్ చేసిన అమెజాన్

ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సరికొత్త ఫీచర్‌ను అందుబాటులో తీసుకొచ్చింది. దీని ద్వారా కస్టమర్లు మరింత సౌకర్యవంతంగా, సులభం గా షాపింగ్ చేసేందుకు వీలవుతుం దని అమెజాన్ చెబుతోంది.లెన్స్‌లైవ్ పేరుతో ప్రారంభించిన ఈ ఫీచర్ ద్వారా కస్టమర్లు తమ చుట్టూ ఉన్న వస్తువులను స్కాన్ చేసి అమెజాన్‌లో కొనుగోలు చేసే వీలుంటుంది. ఇది గూగుల్ లెన్స్ మాదిరిగానే ఉంటుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ను అమెరికాలోని 10 లక్షలకు పైగా ఐఓఎస్ కస్టమర్లకు అనుమతిచ్చింది. త్వరలో అందరికీ అందుబాటులోకి వస్తుందని అమెజాన్ వెల్లడించింది.


విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news




# అందరినీ ఆదుకుంటాం

- రాష్ట్రమంతటికీ విస్తరిస్తాం మీ కష్టాలు చూసి తగిన సాయం అందించేందుకే వచ్చా..
- ఇళ్లు కూలిపోయిన పేదలకు ప్రత్యేక కోటా కింద ఇళ్లు మంజూరు చేస్తాం
- కొడంగల్‌తో సమానంగా కామారెడ్డి అభివృద్ధి చేస్తామని వెల్లడి
- కామారెడ్డి జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులతో కలిసి పర్యటన

- కొడంగల్ ఎంతో కామారెడ్డీ అంతే...
- వరద బాధితుల కష్టాలు తెలుసుకోవడానికే వచ్చా
- వేల మంది ఒకేసారి వస్తుండటంతోనే యూరియా సమస్య...
- ఇసుక మేటల తొలగింపునకూ నిధులిస్తాం
- కామారెడ్డి జిల్లా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- వరద నష్టంపై అధికారులతో సమీక్ష

**సూర్య కామారెడ్డి/నిజామాబాద్**


వందేళ్లలో ఇంత వర్షం ఎప్పుడూ పడలేదు. వరదల విషయం తెలియగానే మంత్రులతో చర్చించి కామారెడ్డికి రావాలని ప్రయత్నించాను. వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. మెదక్ వెళ్లి... అక్కడి నుంచే కామారెడ్డి కలెక్టర్‌తో మాట్లాడాను. వర్షాలు, వరదలతో సంభవించిన నష్టానికి తాత్కాలిక మరమ్మతులు సరిపోవు. అందుకే ప్రత్యక్షంగా చూడటానికి వచ్చాను. పొలాల్లోని ఇసుక మేటలను తొలగించేందుకు కూడా ప్రత్యేకంగా నిధులిచ్చి వ్యవసాయ యోగ్యంగా చేసుకునేలా సహకరిస్తాం. "కొడంగల్ నియోజకవర్గానికి ఏ సాయం చేస్తానో... కామారెడ్డికీ అదే చేస్తానని గతంలోనే చెప్పా. కామారెడ్డికి సాయం అందించడానికి ఎప్పుడూ ముందుంటాను. మీ కష్టాల్లో అండగా నిలబడతాను. అందుకే మిమ్మల్ని నేరుగా కలవడానికి వచ్చా. ఆడబిడ్డల సమస్యలు తెలుసుకున్నా. వాటన్నింటినీ పరిష్కరించి... ప్రభుత్వం అండగా ఉంటుంది. ధైర్యంగా ఉండండి" అని వరద బాధితులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇటీవలి భారీ వర్షాలతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాలో సీఎం గురువారం పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి తొలుత కామారెడ్డి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను హెలికాప్టర్‌లో పరిశీలించారు. అనంతరం తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో లింగంపేట మండలం లింగంపల్లి కుర్దుకు వెళ్లి... వరదలకు దెబ్బతిన్న ఆర్ అండ్ బీ వంతెనను - మిగతా2లో



## దేశ ప్రజల దుర్భర జీవితానికి కాంగ్రెస్సే కారణం

- చిన్నారుల చాక్లెట్లపైనా భారీగా పన్ను వేశారు
- కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం
- జీఎస్టీ స్లాబ్ సంస్కరణలతో అందరికి ప్రయోజనం
- దేశ చరిత్రలో ఇదో మైలురాయి
- జీఎస్టీ సంస్కరణలతో దేశం మరింత బలపడుతుంది
- నిత్యవసర వస్తువులు తగ్గుతాయి

3



## అయోధ్య రామాలయానికి హైటెక్ భద్రత!

- హైటెక్ భద్రతా పరికరాల ఆవశ్యకతను వివరిస్తూ రూపొందించిన ప్రతిపాదనలు ఖరారు
- ఆలయ నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నందున.. భద్రతకు సంబంధించి కొత్త సమస్యలు
- చాలాకాలంగా ఉగ్రవాదుల టార్గెటెడ్ లిస్టులో రామజన్మభూమి

## మోదీ బ్రహ్మాస్త్రం జీఎస్టీ





- ప్రతిపక్షాలను ఆత్మరక్షణలోకి నెట్టిన నిర్ణయం
- బిహార్ సహా త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి
- రాజకీయ విశ్లేషకుల అంచనా

వివరాలు 3లో..



## విస్తృత సేవలతో ఇందిరమ్మ ఇళ్ల యాప్

- ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం లబ్ధిదారులకే..
- బిల్లుల విడుదల మరింత వేగవంతం.. పారదర్శకతకు పెద్దపీట
- హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్

**సూర్య కామారెడ్డి/నిజామాబాద్**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులే బిల్లుల కోసం స్వయంగా ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించినట్టు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. లబ్ధిదారులకు నిర్దేశిత సమయంలో బిల్లులను - మిగతా2లో

## లబ్ధిని వినియోగదారులకు అందించండి

- దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ
- 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర
- జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్

3



# వరద సాయం రూ.16,732 కోట్లివ్వండి

- తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా గుర్తించండి
- ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5018.72 కోట్ల నష్టం
- గతేడాది రూ.11,713 కోట్ల నష్టానికీ సాయం అందలేదు
- గత, ప్రస్తుత సాయం కింద 16,732 కోట్లు అందించండి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- త్వరలోనే కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపుతామని అమిత్ షా హామీ
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు సాయం చేయాలని కేంద్ర మంత్రి నిర్మలకు భట్టి, తుమ్మల వినతి



**సూర్య న్యూఢిల్లీ**

తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలను జాతీయ విపత్తుగా పరిగణించి ప్రత్యేక సాయం అందించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. వర్షాలతో భారీగా పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, కేంద్రం తక్షణమే సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో అమిత్ షా అధికారిక నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆగస్టు 25 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని.. కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ విధ్వంసం - మిగతా2లో

# కౌంట్ డౌన్

## జీఎస్టీ కొత్త పన్ను రేట్లు అమల్లోకి వచ్చే 22వ తేదీపై అందరి దృష్టి





- టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లపై రూ.1,500 నుంచి 45 వేల వరకు తగ్గే చాన్స్
- 13 శాతం వరకు తగ్గనున్న ఐస్‌క్రీమ్‌ల ధరలు
- ద్విచక్ర వాహనాలపై 25 వేల వరకు మిగులు
- జిమ్‌లు, సెలూన్లపై పన్ను 5 శాతానికి తగ్గింపు
- రూ.100లోపు సినిమా టికెట్లపై తగ్గిన పన్ను
- స్విగ్గీ, జొమాటో ఫుడ్ డెలివరీ కాస్త భారం
- ఐపీఎల్ టికెట్లపై 40 శాతం పన్ను మోత
- బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్లు మరింత ప్రియం

**సూర్య న్యూఢిల్లీ**

జీఎస్టీ శ్లాబుల కుదింపు, చాలా రకాల వస్తువుల పన్నుల్లో మార్పుతో లబ్ధి ఎంత? పన్ను తగ్గిన వస్తువుల ధరలు నేరుగా అంత శాతం తగ్గుతాయా? ఇతర అంశాల ప్రభావం ఏమైనా ఉంటుందా? ఏయే వస్తువుల రేట్లు ఎంత వరకు తగ్గుతాయి? టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ వంటివాటి నుంచి కార్లు, బైకుల దాకా ఏది కొంటే ఎంత ఆదా అవుతుంది? ఎవరెవరికి, ఎలాంటి ప్రయోజనం ఉంటుంది?.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే చర్చ.. కొత్త పన్ను రేట్లు అమల్లోకి వచ్చే సెప్టెంబరు 22 పైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. కొత్తగా కార్లు, ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రిక్ గృహోపకరణాలు కొనుగోలు చేయాలని భావించే వారంతా ఇప్పుడు కొనేకంటే.. 22వ తేదీ తర్వాత కొంటే - మిగతా5లో

## రాష్ట్ర ఖజానాకు 10 వేల కోట్ల నష్టం!





- ప్రధాన రంగాల్లో తగ్గనున్న జీఎస్టీ రాబడి..
- సిమెంటు, ఆటోమొబైల్‌పై 10% పన్ను తగ్గుదల
- గ్రానైట్‌పై తగ్గనున్న 7% ఆదాయం
- పరిహారం చెల్లించాలని సర్కారు డిమాండ్

వివరాలు 2లో..

# రాష్ట్ర ఖజానాకు 10 వేల కోట్ల నష్టం!

హైదరాబాద్,

కేంద్రం 'వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)'లో తెచ్చిన సంస్కరణలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడనుంది. వివిధ రకాల సరుకులు, సేవలపై పన్ను రేట్లను తగ్గించడం, ఎత్తివేయడం వల్ల రాబడి గణనీయంగా తగ్గనుంది. పన్ను రేట్ల సవరింపుతో రాష్ట్రాలకు రూ.2 లక్షల కోట్ల మేర రాబడి తగ్గుతుందని బీజేపీయేతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఒక్క తెలంగాణకే రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లనుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. కానీ, ఈ నష్టం రూ.10 వేల కోట్లకు పైగా ఉంటుందని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువ విక్రయాలు జరిగే సిమెంటు, ఆటోమొబైల్, ఔషధాలు, ఎలక్ట్రానిక్ వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించింది. జీవిత, ఆరోగ్య బీమా సేవలపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేసింది. చాలా రకాల నిత్యావసరాలపై పన్నును తొలగించింది. నిజానికి ఇవి రాష్ట్రానికి అత్యధిక రాబడిని సమకూరుస్తున్నాయి. వీటిపై విధించే జీఎస్టీ సొమ్ములో సగం కేంద్రానికి, సగం రాష్ట్రానికి దక్కుతుంది. ఉదాహరణకు సిమెంటుపై రాష్ట్ర రాబడి దారుణంగా తగ్గే అవకాశాలున్నాయి. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పెద్ద రాబడి మార్గం. భవన నిర్మాణ రంగంలో నెలకు 1.5–2 మిలియన్ టన్నులకు పైగా సిమెంటును వినియోగిస్తున్నట్లు అంచనా. బ్రాండును బట్టి ఒక్కో సిమెంటు బ్యాగు ధర రూ.350కి పైగా పలుకుతోంది. ఈ సిమెంటు విక్రయాలపై ప్రభుత్వం ఇదివరకు 28 శాతం జీఎస్టీని విధించేది. ఇప్పుడు దాన్ని 18 శాతం శ్లాబులో చేర్చింది. అంటే మొత్తం సిమెంటు విక్రయాలపై 10 శాతం మేర పన్ను రాబడి తగ్గిపోనుంది.

రాష్ట్రంలో గ్రానైట్ పరిశ్రమ కూడా పెద్దదే. గ్రానైట్‌పై 12 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గనుంది. దీని ద్వారా వచ్చే రాబడిలో 7 శాతం మేర తగ్గనుంది. వ్యక్తిగత, జీవిత బీమాలపై ఇదివరకున్న 18 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించారు. దీని ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన 18 శాతం రాబడి పూర్తిగా పోనుంది.

ఆటోమొబైల్ రంగం రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గణనీయంగా ఊతమిస్తోంది. ఈ రంగంలోని కార్లు, త్రిచక్ర వాహనాలపై జీఎస్టీ తగ్గడంతో రాబడికి గండి పడనుంది. రాష్ట్రంలో ఏటా వివిధ రకాల వాహనాలు దాదాపు 10 లక్షలకు పైగా అమ్ముడవుతున్నాయి. వీటిపై 10% మేర జీఎస్టీ తగ్గనుండడంతో రాబడిపై ప్రభావం చూపనుంది.

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ ఉపకరణాల మార్కెట్ కూడా పెద్దదే. ముఖ్యంగా ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు బాగా అమ్ముడవుతుంటాయి. వీటిపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నారు. ఇక్కడా 10 శాతం మేర రాబడి తగ్గుతుంది.

నిత్యావసర వస్తువుల (ఎఫ్ఎంసీజీ) మార్కెట్ కూడా రాష్ట్రానికి పెద్ద రాబడి మార్గం. ఈ విభాగంలోని చాలా వస్తువులను 5% శ్లాబులో చేర్చారు. కొన్నింటిపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేశారు. ఇలా అన్ని రకాలుగా రాష్ట్ర రాబడి రూ.10 వేల కోట్లకు పైగా తగ్గుతుందని చెబుతున్నారు

**పరిహారం ఇవ్వండి..**

పన్ను శ్లాబుల సవరింపుతో కోల్పోతున్న రాబడిని పూడ్చడానికి పరిహారం చెల్లించాలని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కొత్తగా ఏర్పడిన తెలంగాణకు తప్పకుండా పరిహారం చెల్లించాలని ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి.. జీఎస్టీ మండలికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ)లో జీఎస్టీ వాటా 2022–23లో 3.07 శాతం ఉండగా.. 2024–25లో అది 2.58 శాతానికి పడిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం వివరిస్తోంది. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణతో ఇది మరింత తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. జీఎస్టీ తగ్గింపు కారణంగా నష్టపోయే రాబడిని పరిహారం రూపంలో పూడ్చాలని డిమాండ్ చేస్తోంది.

# అందరినీ ఆదుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

పరిశీలించారు. అక్కడ వరద నష్టాలపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను చూశారు. అదే మండలం బురిగిద్ద గ్రామంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అక్కడ పొలాల్లో ఇసుక మేటలు వేసిన రైతులతో మాట్లాడారు. నష్టం వివరాలు కనుక్కున్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. అక్కడి నుంచి కామారెడ్డికి చేరుకుని... జీఆర్ కాలనీలో పర్యటించారు. ఇళ్లు నీటమునిగిన బాధితులతో మాట్లాడారు. వరదల ధాటికి పూరి గుడిసెలనూ కోల్పోయిన బాధితులకు గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు ఇప్పిద్దామని, ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు తక్షణమే రూ.5 లక్షలు ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. అనంతరం కామారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా సందర్భాల్లో సీఎం మాట్లాడారు.

**శాశ్వత పరిష్కారం అవసరం**

భారీ వర్షాలతో పేదలు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. తాత్కాలికంగా మీ సమస్యల పరిష్కారానికి కలెక్టర్లకు ఆదేశాలిచ్చా. ప్రజాప్రతినిధులే కాకుండా.. అధికారులు కూడా పరస్పరం సహకరించుకోవడంతో చాలా ప్రాణనష్టం తగ్గింది. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సహకారంతో చాలామంది ప్రాణాలను కాపాడగలిగాం. జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్రతో పాటు అధికారులంతా సహకరించారు. అందుకే ప్రాణ, ఆస్తి, పశుసంపద నష్టం చాలా తక్కువగా జరిగింది. ఆ సమయంలో 24 గంటలూ పనిచేసిన అధికారులందరినీ అభినందిస్తున్నా. వరదలు ఉద్ధృతం కావడంతో మంత్రి సీతక్క, ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఫోన్ చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించా.

**టోకెన్లు ఇస్తే.. యూరియా సమస్య ఉండేది కాదు**

యూరియా దుకాణాలకు వేల మంది ఒకేసారి వస్తే సమస్యగా మారుతుంది. రైతువేదికల వద్ద ఇద్దరేసి పోలీసులను నియమించి రైతులకు ముందే టోకెన్లు



ఇచ్చి.. ఒక్కొక్కరిని ఒక్కో రోజు రమ్మంటే ఏ సమస్యా ఉండదు. అంతా ఒకేసారి వచ్చి ఒకే దగ్గర నిలబడితే వరుస పెద్దగా కనిపిస్తుంది. యూరియా అందుబాటులో ఉన్నా.. వెయ్యి మంది వరుసలో ఉంటే చివరి వ్యక్తికి అందేసరికి 8 గంటలకు పైగా పడుతుంది. అంతసేపు నిలబడలేక, సహనం నశించి... యూరియా అందుబాటులో లేదని కొన్నిసార్లు రోడ్డుకు అడ్డంగా కూర్చుంటారు. పాలేరు నియోజకవర్గంలో ఎక్కడికక్కడ పూర్తిగా పీఏసీఎస్‌ల ద్వారా ఒక క్రమపద్ధతిలో యూరియా పంపిణీ చేస్తుండడం సత్ఫలితాలనిస్తోంది. మిగిలిన చోట్ల కూడా ఇలాంటి విధానాన్ని అమలు చేస్తే సమస్యను పరిష్కరించవచ్చు.

**మళ్లీ 15 రోజుల్లో సమీక్ష**

సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా, మానవత్వంతో వ్యవహరించాలి. అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా ప్రజల అవసరాలు, సమస్యలు పరిష్కరించడానికే ఉన్నాం. విపత్తు నిర్వహణలో కామారెడ్డి జిల్లా నమూనాగా నిలవాలి. కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పకడ్బందీగా అమలు చేస్తే ఇదే విధానాన్ని ఇతర జిల్లాల్లో ఆచరించడానికి అవకాశం ఉంటుంది. మళ్లీ 15 రోజుల తర్వాత సమీక్ష చేస్తా. కేవలం కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల వారితోనే కాకుండా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యేలతో సమస్యలపై సమీక్ష నిర్వహించాలని మంత్రి సీతక్కకు సూచిస్తున్నా. కలెక్టర్లు, ఎమ్మెల్యేలు... మీ సమస్యలన్నీ సీతక్కకు చెప్పండి. రాబోయే 10 రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలందరితో హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించుకుందాం. దానికి ఎంపీలు సురేశ్ షెట్కార్, ధర్మపురి అర్వింద్‌లనూ ఆహ్వానించండి.

అధికారులంతా ప్రతిపాదనలతో రావాలి. వరదలతో జరిగిన నష్టం, ఏమేం మరమ్మతులు చేయాలి, ఎంత నిధులు మంజూరు చేయాలో వివరాలిస్తే వాటన్నింటిపై సానుకూలంగా స్పందించి వేగంగా నిధులు విడుదల చేస్తాం.

తాత్కాలికంగా కాకుండా.. శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికాబద్ధంగా ముందుకు రావాలి. విపత్తుల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచే బిల్లులన్నీ రాబట్టుకోవాలని అధికారులు యత్నిస్తున్నారు. ఇకనుంచి అలా కాకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి రాబట్టుకునే ప్రయత్నం చేద్దాం. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి భాజపాకు చెందినవారైనా... సహకారం అందించడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'పోచారం ప్రాజెక్టును వందేళ్ల క్రితం రూ.20 లక్షలతో కట్టారు. ఇంత వరద వచ్చినా తెగకుండా గట్టిగా ఉంది. ఇంతకుమించి నేనేం చెప్పలేను' అని పరోక్షంగా కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశించి ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. చెరువులు, కుంటలు, రోడ్లకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతరావు, సుదర్శన్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర పాల్గొన్నారు. వరదల కారణంగా చనిపోయినవారి కుటుంబ సభ్యులకు కామారెడ్డి కలెక్టరేట్‌లో రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం చెక్కులను సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు.

# వరద సాయం రూ.16,732 కోట్లివ్వండి

-మొదటిపేజీ తరువాయి

జరిగిందని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5,018 కోట్ల మేర నష్టం జరిగిందని వివరించారు. గతేడాది ఖమ్మంతోపాటు పరిసర జిల్లాల్లో భారీవర్షాల కారణంగా రూ.11,713 కోట్ల మేరకు నష్టం వాటిల్లగా, అప్పుడే దీనికి సంబంధించిన నష్ట అంచనా నివేదికను కేంద్రానికి పంపామని గుర్తుచేశారు. ఈ రెండేళ్లకు కలిపి రూ.16,732 కోట్ల సాయాన్ని తక్షణమే అందించాలని కోరారు.

**ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు నిధులివ్వండి**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. ఢిల్లీలో ఆమె కార్యాలయంలో గురువారం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో విద్యా నాణ్యత, పిల్లల పోషకాహారం అనే రెండు సవాళ్లను పరిష్కరించడానికి ప్రవేశపెట్టిందే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రోగ్రాం అని వివరించారు. 105 అత్యాధునిక రెసిడెన్షియల్ క్యాంపస్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. ఈ సమగ్ర విద్యా విధానం కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామని చెప్పారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.110 కోట్లు ఇవ్వండి

రూరల్ రోడ్ కనెక్టివిటీ ప్రోగ్రాం కింద ఖమ్మంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.110 కోట్లు ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని



చంద్రశేఖర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. ఢిల్లీలో గురువారం పెమ్మసానితో తుమ్మల భేటీ అయ్యారు.

ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో గిరిజనులు అధికంగా నివసిస్తున్నారని, ఈ ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ డ్రైనేజింగ్ నెట్‌వర్క్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తుమ్మల మీడియాకు వెల్లడించారు.

## విస్తృత సేవలతో ఇందిరమ్మ ఇళ్ల యాప్

-మొదటిపేజీ తరువాయి

విడుదల చేయడానికి ఇది తోడ్పడుతుందన్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ కార్పొరేషన్ పీడీలు, ఇతర సిబ్బందితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగంపై సమగ్రమైన అవగాహన కల్పించాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలు, ఇంతవరకు చేసిన చెల్లింపులు తదితర సమాచారమంతా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి ఎక్కడి నుంచైనా తెలుసుకునే విధంగా యూనివర్సల్ సెర్చ్‌తో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. తమ బిల్లు ఎక్కడ ఉంది..ఏ తేదీన, ఎంత మొత్తం ఏ బ్యాంక్ అకౌంట్‌లో జమ అయ్యింది తదితర వివరాలు పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి తేవడంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గిపోతుందని చెప్పారు. గురువారం నుంచి ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు/బిల్ కలెక్టర్లు తదితర స్థాయిల్లో ఉద్దేశపూర్వక జాప్య నివారణకు, అక్కడక్కడా జరుగుతున్న అవినీతిని అరికట్టడానికి ఈ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్యకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ మమత, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**అప్‌లోడ్ చేసేది ఇలా...**

మొదటగా మొబైల్ ఫోన్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత బెనిఫియరీ లాగిన్‌లో మొబైల్ నంబరు ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసిన తర్వాత డ్యాష్ బోర్డులో లబ్ధిదారుడి పేరు, మొబైల్ నంబరు తదితర వివరాలతోపాటు ఫొటోలు తీయడం (క్యాప్చర్ ఫొటోగ్రాఫ్) అనే వాటి కింద ఇళ్ల నిర్మాణపు దశలు (గ్రౌండింగ్, బేస్‌మెంట్, వాలింగ్, స్లాబ్, నిర్మాణం పూర్తి) అని కనిపిస్తాయి.

లబ్ధిదారులు గ్రౌండింగ్ స్థాయి ఫొటోలు అప్‌లోడ్ చేయాలనుకుంటే గ్రౌండింగ్‌పై క్లిక్ చేస్తే దరఖాస్తుదారుడికి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. లబ్ధిదారులు ప్రతిపాదిత ఇంటి నిర్మాణ స్థలం నుంచే మొబైల్ ఫోన్‌లోని కెమెరాతో ఫొటోలు తీయాలి, ఇక్కడే కెమెరాలో జియో ట్యాగింగ్ నిమిత్తం మ్యాప్ సింబల్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి, ఒకసారి సరిచూసుకున్న తర్వాత సబ్మిట్ చేయాలి. ఆ తర్వాత వెనక్కి వెళ్లి గ్రౌండింగ్ బటన్‌పై క్లిక్ చేస్తే వివరాలన్నీ కనిపిస్తాయి. బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణ పనులు జరుగుతున్న ఇంటి వద్ద లబ్ధిదారుతోపాటు ముందువైపు నుంచి, పక్క నుంచి, పైనుంచి (టాప్ యాంగిల్) ఫొటోలు తీయాలి, ఈ ఫొటోలు గ్రౌండింగ్ సమయంలో తీసిన ప్రాంతం సమీపం నుంచే తీయాలి. ఆపై యాప్‌లో అడిగిన సమాచారాన్ని నమోదు చేసి సబ్మిట్ చేయాలి.

ఇదే తరహాలో వాలింగ్ దశలోనూ, స్లాబ్ దశలోనూ, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఫొటోలు తీసి లబ్ధిదారులే నేరుగా బిల్లుల కోసం అప్‌లోడ్ చేయొచ్చు. గ్రామ కార్యదర్శులు, ఎంపీడీఓలు, డీఈఈలు పీడీ, తదితర అధికారులు, ఈ విధంగా నమోదైన వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకున్న తర్వాతనే లబ్ధిదారులకు బిల్లులు విడుదల చేస్తారు.

## ఎరువుల దుకాణంపై రాళ్ల దాడి



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం యూరియా బస్తాల కోసం రైతులు కన్నెర్ర చేశారు. ఎరువుల దుకాణం వద్ద బస్తాలు పంపిణీ చేస్తుండగా.. రైతులు ఎగబడగా యాజమాని షాపు మూసివేసి వెళ్లిపోవడంతో ఆగ్రహించిన రైతులు మూసివున్న దుకాణంపై ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. స్థానిక సూర్య థియేటర్ సమీపంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో బుధవారం 330 (12 టన్నుల) యూరియా బస్తాలు వచ్చాయి. అయితే దుకాణం యాజమాని కొన్ని బస్తాలే ఇచ్చి రేపు మళ్లీ ఇస్తామని చెప్పి షాపు బంద్ చేసి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం కూడా దుకాణం మూసివేసి వెళ్లిపోవడంతో ఆగ్రహించిన రైతులు దుకాణంపై ఇటుకలు, రాళ్లతో షాపుపై దాడి చేశారు. దుకాణం ముందు కర్రలు వేసి నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు మన గ్రోమోర్ గోదాం తాళాలు పగులగొట్టి యూరియా బస్తాలను తీసుకువెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం షాపు యాజమానితో మాట్లాడి రైతులను క్యూలైన్‌లో నిలబెట్టి అందులో ఉన్న 180 బస్తాల యూరియాను రైతులకు అందించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వెంటనే యూరియా ఇవ్వాలంటూ నినాదాలతో హోరెత్తించారు. ఒక దశలో క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు, రైతులకు మధ్య తోపులాట జరిగింది. యూరియా పంపిణీ చేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లిలో రాస్తారోకోలు నిర్వహించారు. గంటల కొద్దీ క్యూలో నిల్చున్నా యూరియా ఇవ్వడం లేదంటూ కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబర్‌పేటలో రైతులు వ్యవసాయ అధికారి మణిదీపికను దిగ్బంధించారు. భద్రాద్రి జిల్లా ఇల్లెందు వ్యవసాయ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. పది రోజులుగా తిరుగుతున్నా ఒక్క యూరియా బస్తా కూడా దొరకడంలేదంటూ మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఇల్లెందు–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై భారీ సంఖ్యలో రైతులు రాస్తారోకో నిర్వహించగా.. ఇద్దరు రైతులు పురుగు మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా ధర్మారావుపేటలో వందలాది మంది రైతులు పంపిణీ కేంద్రానికి ఎగబడడంతో తోపులాట జరిగి.. పలువురు మహిళా రైతులు స్పృహ తప్పి పడిపోయారు.

**యూరియా పంపిణీకి సిరా గుర్తు !**

నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం తీలేర్ సింగిల్‌విండో వద్ద యూరియా కోసం రైతులు భారీ సంఖ్యలో పోటెత్తడంతో అధికారులు.. ఎన్నికల మాదిరిగా రైతుల వేళ్లకు సిరా గుర్తు వేసి.. టోకెట్లు ఇచ్చారు. అనంతరం వరుసగా యూరియా పంపిణీ చేశారు. గంటల కొద్దీ క్యూలో నిలబడిన స్పృహ తప్పి పడిపోయిన తీలేర్‌కు చెందిన రైతు మణెమ్మను ఆస్పత్రికి తరలించిన అనంతరం.. అధికారులు ఈ విధానాన్ని అమలు చేశారు.

**600 బస్తాల యూరియాతో లారీని పట్టుకున్న పోలీసులు**

దొడ్డిదారిన 600 బస్తాల యూరియాను తరలిస్తున్న లారీని వికారాబాద్ జిల్లా పరిగిలో పోలీసులు పట్టుకుని పోలీసస్టేషన్‌కు తరలించారు. మాదారంలోని పవన్‌ప్లైవుడ్ కంపెనీకి సంబంధించినదని, అయితే అది పరిశ్రమలకు ఉపయోగించే యూరియా అని కంపెనీ యాజమాన్యం చెప్పడంతో వ్యవసాయాధికారులకు లేఖ రాశామని పోలీసులు తెలిపారు.

# కౌంట్‌డౌన్..




-మొదటిపేజీ తరువాయి

ఎంత మిగులుతుందనే అంచనాలు వేసుకుంటున్నారు.

**చక్కెర కలిపితే 'ధర' చేదు!**

సహజ, కృత్రిమ చక్కెరలు కలిపిన శీతల పానీయాలు, కృత్రిమ పళ్ల రసాలు, ఇతర పానీయాలను 'హానికర' పదార్థాల కేటగిరీతోపాటు 40శాతం ప్రత్యేక పన్ను రేటులో చేర్చడం గమనార్హం. దీనితో శీతల పానీయాలు, ఐస్ టీలు, కెఫీన్ కలిపిన పానీయాలు, ఎనర్జీ డ్రింకులు వంటివాటి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇదే కారణంతో కారమెల్ తీపి పదార్థం కలిపిన పాప్‌కార్న్‌ను కూడా 18శాతం పన్ను రేటులో కొనసాగించారు. సాధారణ పాప్‌కార్న్‌పై 5శాతమే పన్ను వేశారు. మరోవైపు చక్కెర కలిపేవే అయినా.. పళ్ల రసాలు, పాల ఆధారిత పానీయాలు, ఐస్ క్రీమ్, పేస్ట్రీలు, సంప్రదాయ మిఠాయిలపై పన్ను రేటును 5శాతానికే పరిమితం చేశారు.

**బీడీలు చవక.. సిగరెట్లపై మోత!**

సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను 40 శాతం ప్రత్యేక పన్ను రేటులోకి చేర్చిన జీఎస్టీ కౌన్సిల్.. బీడీలను మాత్రం 28శాతం నుంచి 18శాతం పన్నురేటుకు మార్చింది. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. బీడీల ధరలు మాత్రం తగ్గే అవకాశం ఉంది. మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది మంది బీడీల తయారీపై ఆధారపడి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

**ఐస్‌క్రీమ్‌లు మరింత తీపి..**

పాలు, పాల ఉత్పత్తులపై వసూలు చేస్తోన్న జీఎస్టీ అంశం లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐస్‌క్రీమ్‌ల ధరలు బాగా తగ్గనున్నాయి. ఉత్పత్తిదారు లేదా ఐస్‌క్రీమ్ పార్లర్లు, రిటైల్ దుకాణాల్లో విక్రయించే ఐస్‌క్రీములపై జీఎస్టీని 18% నుంచి 5 శాతానికి తగ్గించారు. ఉదాహరణకు ఓ ఐస్‌క్రీమ్ ధర రూ.100 అయితే 18 శాతం జీఎస్టీ కలిపి రూ.118 అయ్యేది. ఇప్పుడు రూ.105కు తగ్గుతుంది. ఇక నెయ్యి, వెన్న, చీజ్ వంటి వాటిపై ప్రస్తుతం 12% ఉన్న పన్నును ఐదు శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయాలు వినియోగదారులతోపాటు పాడి రైతులకు, డెయిరీ పరిశ్రమకు లబ్ధి చేకూరుస్తాయని కేంద్రం ప్రకటించింది. వెన్న, నెయ్యి, పాలు విక్రయానికి వాడే ఇనుము, స్టీల్, అల్యూమినియం డబ్బాలపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించడం కూడా డెయిరీ రంగానికి ఊరటనిచ్చే అంశమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**తగ్గనున్న హోటల్ గదుల అద్దెల భారం.. పర్యాటకానికి ఊతం**

రోజుకు రూ.7,500లోపు అద్దె ఉండే హోటల్ గదులపై జీఎస్టీని ప్రభుత్వం 5 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయం పర్యాటక రంగానికి ఊతమిస్తుందనే హర్షం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం రూ.వెయ్యి- 7,500 లోపు అద్దె గదులపై 12% జీఎస్టీ ఉంది. తాజా తగ్గింపుతో పర్యాటకులపై అద్దె భారం తగ్గనుంది. ప్రస్తుతం రూ.6వేలు అద్దె అయితే 12% జీఎస్టీ కలిపి రూ.6,720 చెల్లించాలి. అదే సెప్టెంబరు 22 నుంచి రూ.6,300 చెల్లిస్తే చాలు. కాగా, సెప్టెంబరు 22నుంచి రూ.7500 పైబడిన అద్దె ఉండే గదులను 18 శాతం జీఎస్టీ పరిధిలోకి వస్తాయి.

**బిజినెస్ క్లాస్ ఫ్లైట్ టికెట్లు మరింత ప్రియం**

ఈ నెల 22 నుంచి విమానాల్లో ఎకానమీ మినహా బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్ల ధరలు పెరగనున్నాయి. ఎకాన మీ టికెట్లపై జీఎస్టీ 5% మార్చలేదు. బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్లపై జీఎస్టీని 12 శాతం నుంచి 18 శాతానికి పెంచారు. ఫలితంగా విమానాల్లో సౌకర్యవంతంగా, విలాసవంతంగా ప్రయాణించాలంటే మరింత డబ్బు చెల్లించాల్సిందే. అయితే, ధరలు పెరిగితే ఎకానమీ క్లాస్ టికెట్లకు డిమాండ్ పెరుగుతుందని విమానయాన రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**పాప్‌కార్న్ ఓకే.. 'కారమెల్'కు ఎఫెక్ట్**

పాప్‌కార్న్‌పై ఇటీవలి వరకు ఉన్న విమర్శలకు తాజాగా చెక్ పడింది. ఇంతకుముందు పాప్‌కార్న్ విడిగా అమ్మితే 5%, ప్యాక్ చేస్తే 12%, కారమెల్ (తీపి) ఫ్లేవర్ కలిపితే 18% పన్ను ఉండేది. ఇకపై విడిగా, ప్యాక్ చేసినా 5శాతమే పన్ను ఉంటుంది. కారమెల్‌పై మాత్రం 18% పన్ను కొనసాగుతుంది.

**ఫిట్‌నెసకు, అందానికి ఖర్చు తగ్గినట్టే!**

జిమ్‌లు, యోగా కేంద్రాలు, హెల్త్ క్లబ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లు, సెలూన్లు, బార్బర్లు తదితర సేవలపై ఇప్పటివరకు 18శాతం పన్ను ఉండగా.. ఇప్పుడు 5శాతానికి తగ్గించారు. దీనితో ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం, అందం కోసం చేసే ఖర్చు కాస్త తగ్గనుంది.

**ఫుడ్ డెలివరీ మరికొంత భారం!**

స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీతోపాటు బ్లింక్ ఇట్, స్విగ్గి ఇన్‌స్టా వంటి గ్రోసరీ డెలివరీ సేవలపై కొత్తగా 18% జీఎస్టీ విధించారు. డెలివరీ చార్జీలపై ఈ పన్ను వర్తిస్తుంది. ప్రస్తుతం ఒక్కో జొమాటో ఆర్డర్‌పై రూ.2, స్విగ్గీ ఆర్డర్‌పై రూ.2.6, ఇన్‌స్టామార్ట్ ఆర్డర్‌పై రూ.1 వరకు భారం పడుతుంది.

**రూ.100లోపు సినిమా టికెట్లపై తగ్గిన పన్ను**

సినిమా థియేటర్లలో రూ.100 లోపు ధర ఉండే టికెట్లపై పన్నును 12% నుంచి 5%కు తగ్గించారు. అంటే సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోని థియేటర్లలో టికెట్ రేట్లకు ఉపశమనం ఎక్కువగా ఉండనుంది.

**ఐపీఎల్ టికెట్లపై పన్ను మోత**

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు, ఇతర గుర్తింపు లేని క్రీడా కార్యక్రమాల టికెట్లపై జీఎస్టీని 28% నుంచి 40 శాతం ప్రత్యేక పన్నురేటులోకి మార్చారు. దీని తో వాటి టికెట్ల ధరలు బాగా పెరుగుతాయి. ఉదాహరణకు రూ.1000 ఐపీఎల్ టికెట్‌పై పన్ను కలిపి రూ.1,400 అవుతుంది. ప్రత్యేకంగా గుర్తించిన క్రీడా కార్యక్రమాలకు 18% జీఎస్టీ కొనసాగనుంది.

**రాష్ట్రపతి బీఎండబ్ల్యూ కారుకు జీఎస్టీ మినహాయింపు**

కేంద్రం రాష్ట్రపతి కోసం కొనుగోలు చేస్తున్న బీఎండబ్ల్యూ 7 సిరీస్ కారుకు జీఎస్టీ మినహాయింపు ఇచ్చారు. దీని విలువ సుమారు రూ.3.66 కోట్లు. అత్యాధునిక భద్రత సదుపాయాలు ఉన్న ఈ కారును రాష్ట్రపతి భద్రత కోసం కొనుగోలు చేస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు జీఎస్టీ కౌన్సిల్ పేర్కొంది. రాష్ట్రపతి ప్రస్తుతం మెర్సిడెస్ బెంజ్ ఎస్600 పుల్‌మన్ లిమోజిన్ వాడుతున్నారు.

# ఈఎంఐ.. విలాసమే.. విలాపమై!




జెన్ జీ, మిలేనియల్స్‌లో పెరుగుతున్న రుణాలు
అందుబాటులో ఎన్‌బీఎఫ్‌సీలు, లోన్ యాప్‌లు
కొనేముందు 3 ప్రశ్నలు వేసుకుంటే మంచిది
అప్పు భవిష్యత్తుకు ముప్పు అంటున్న నిపుణులు

'అప్పు'డే తెల్లారిందా.. పాత సినిమాలో ఒక డైలాగ్. మిలేనియల్స్ (1981%-%96 మధ్య పుట్టినవారు).. జెన్ జీ (1997%-%2012 మధ్య జన్మించినవారు).. పరిస్థితి ఇలాగే ఉంది. అనవసరా లు, విలాసాల కోసం విపరీతంగా అప్పులు చేసేస్తున్నారు. లోన్‌యాప్‌లు.. సులభ వాయిదాలు.. వారిని 'ఈజీగా' అప్పుల బాట పట్టేలా చేస్తున్నాయి. 'అప్పు చేయడం రోగం.. తీర్చకపోవడం ప్రమాదకరం అనేది గుర్తించకపోతే సమస్యలు తప్పవు' అంటున్నారు నిపుణులు.

క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ 'ట్రాన్స్ యూనియన్ సిబిల్' ప్రకారం.. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో వ్యక్తిగతంగా రుణాలు తీసుకున్న వారు (యునిక్ ఇండివిడ్యువల్ బారోవర్స్) 28 కోట్ల మంది. ఆర్బీఐ లెక్కల ప్రకారం.. వ్యక్తిగత రుణాలు లేదా వ్యాపారం కోసం లేదా ఇతర అవసరాల కోసం రుణాలు తీసుకునేవారి సంఖ్యతోపాటు, తీసుకునే మొత్తం కూడా పెరిగింది. 2018 మార్చి నాటికి తలసరి రుణం రూ.3.41 లక్షలు ఉంటే 2023 మార్చికి రూ.3.8 లక్షలకు, 2025 మార్చి నాటికి రూ.4.77 లక్షలకు పెరిగింది.

**కనీసం 3 రుణాలతో..**

ఫిన్‌టెక్ సంస్థల వంటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) చిన్నచిన్న మొత్తాల్లో ఇచ్చే రుణాలను జెన్ జీ, మిలేనియల్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. రూ.50వేల కంటే తక్కువ రుణాల్లో.. ఈ సంస్థలు ఇచ్చినవే 84.3 శాతం. ముఖ్యంగా ఇలా రుణం తీసుకుంటున్నవారిలో సుమారు 10 శాతం మంది సమయానికి చెల్లించడం లేదట. మరీ ముఖ్యంగా.. గత త్రైమాసికంలో ఇలా రుణం తీసుకున్నవారిలో 66 శాతానికిపైగా అప్పటికే కనీసం 3 రుణాలు తీసుకుని ఉన్నారని ఆర్బీఐ చెబుతోంది.

**అనవసర ఖర్చులకు 29 శాతం**

'భారత్ ఎలా ఖర్చు చేస్తోంది: వినియోగదారుల వ్యయాల తీరుతెన్నులపై లోతైన అధ్యయనం' పేరుతో కన్సల్టింగ్, ఫైనాన్షియల్ అడ్వైజరీ సేవల్లో ఉన్న పీడబ్ల్యూసీ ఇండియా సహకారంతో ఫిన్స్ టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ పర్ఫియోస్ ఇటీవల ఒక నివేదికను రూపొందించింది. 30 లక్షల మంది టెక్%-%ఫస్ట్ వినియోగదారుల లావాదేవీల సమాచారాన్ని, వారు చేసే ఖర్చులను పరిశీలించింది.

ప్రజలు చేసే మొత్తం వ్యయంలో హంగులు, ఆర్భాటాలు వంటి అనవసర ఖర్చులకు చేసేది 29 శాతం ఉంటోంది. ఈ ఖర్చుల్లో 62 శాతం కంటే ఎక్కువ ఫ్యాషన్, వ్యక్తిగత సంరక్షణ వస్తువుల షాపింగ్‌కు చేస్తున్నారు.

తప్పనిసరి ఖర్చులకు చేసే వ్యయం 39% కాగా, అవసరాలకు 32% ఖర్చు చేస్తున్నారు.

అన్ని నగరాల్లోనూ వ్యక్తులు తమ ఆదాయంలో 33 శాతానికి పైగా నెల వాయిదాల (ఈఎంఐ) చెల్లింపులకు కేటాయిస్తున్నారు.

**ఈఎంఐ.. ఆదాయాన్ని మింగేస్తూ**

నెల వాయిదాలు (ఈఎంఐలు).. చాలా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ, దీర్ఘకాలంలో ప్రమాదకరమైనవి. ఎప్పుడు ఎంత ఖర్చు పెడుతున్నామో తెలీదు. – ఇందులోని మరో ముఖ్యమైన విషయం. ఈఎంఐల మాటున ఉండే వడ్డీ.

ఒకేసారి చెల్లించకుండా భవిష్యత్తులో చెల్లించడం వల్ల.. భవిష్యత్తు లక్ష్యాలు, ఖర్చులు, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురిస్తుంది.

ఉద్యోగం పోయినా.. తక్కువ జీతం వచ్చే ఉద్యోగా నికి మారినా.. ఏదైనా అనారోగ్య సమస్యలాంటిది వచ్చి ఆర్థిక అత్యవసర పరిస్థితి వచ్చినా.. ఈఎంఐలు గుదిబండలా మారతాయి. ఒకటికి మించి ఈఎంఐలు ఉంటే ప్రతినెలా తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది.

**జీరో కాస్ట్ ఈఎంఐ**

చాలామంది 'జీరో కాస్ట్ ఈఎంఐ' ఉందిగా అని ఈ మధ్య విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. పేరుకే జీరోకానీ, ఇది కూడా ఖరీదైనదే.

చాలా సందర్భాల్లో ఆయా కంపెనీలు / వేదికలు ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేస్తాయి.

ఈ లావాదేవీ జరిగిన తరువాత.. ఒకవేళ మనకు ఏదో విధంగా డబ్బు చేతికి అంది ఆ అప్పు తీర్చేద్దామంటే కుదరదు. ముందస్తు చెల్లింపులమీద చార్జీ ఉంటుంది. మామూలు ఈఎంఐలానే, ఏదైనా ఒక్క నెలలో చెల్లింపు చేయలేకపోయినా.. ఆలస్యంగా చేసినా.. మొత్తం బకాయిపై వడ్డీ చెల్లించాలి. అలాగే ఆ రుణం తీసుకున్నప్పటి నుంచి జరిపే అలాంటి అన్ని లావాదేవీలపైనా వడ్డీ చెల్లించాలి. ఇలాంటి రకరకాల చార్జీల భారం పడుతుంది.

ఆలస్యంగా చెల్లించడం వల్ల క్రెడిట్ స్కోర్‌పైనా ప్రభావం పడుతుంది.

**ఏమిటి పరిష్కారం?**

ఏది కొనాలని అనిపించినా.. ఒక 10 నిమిషాల పాటు ఆలోచించాలి. మూడు ప్రశ్నలు వేసుకోవాలి.

ఇది అత్యవసరమా? లేక విలాసం కోసం కొంటున్నానా?

దీనిపై చేస్తున్న ఖర్చు నెలవారీ బడ్జెట్‌ను ఎలా ప్రభావితం చేస్తుంది?

ఇది లేకుండా నేను ఉండలేనా?

ఈ ప్రశ్నలకు మీ మనసు చెప్పే సమాధానాలతో మీరు సంతృప్తి చెందాక కొనుగోలు చేయాలా వద్దా అనే నిర్ణయం తీసుకోండి.

వస్తువుల్లో కాకుండా మనుషుల్లో.. అనుబంధాలు, ఆప్యాయతలు, స్నేహాలలో ఆనందాన్ని వెతుక్కోవడం మొదలుపెట్టండి. అంతిమంగా.. అప్పు లేదా ఈఎంఐలు మీ జీవితాన్ని శాసించకుండా చూసుకోండి. ఆనందం, విలాసం కావాల్సిందే.. కానీ, దాని కోసం మీ ఆర్థిక హద్దులు దాటకండి.. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా ఇతరులను చూసి నిర్ణయాలు తీసుకోకండి.

**ఈఎంఐ.. తత్వం అర్థమై..**

ఈఎంఐల తత్వం తెలిసిన వాళ్లు వీటికి కొత్త రూపాలు ఇచ్చారు. అవి..

ఎండింగ్ మై ఇన్‌కమ్ లేదా ఎంప్టీయింగ్ మై ఇన్‌కమ్ లేదా ఈటింగ్ మై ఇన్‌కమ్ (నా ఆదాయాన్ని తినేస్తోంది) ఎవ్రీ మంత్ అయామ్ బ్రోక్ (ప్రతినెలా నన్ను ఏడిపిస్తోంది) ఎక్స్‌క్యూజ్ మై ఇగ్నోరెన్స్ (నా అజ్ఞానాన్ని మన్నించు) ఎండ్‌లెస్ మంత్లీ ఇన్‌కన్వీనియన్స్ (అంతులేని నెలవారీ అసౌకర్యం) ఎవ్రీ మంత్ ఇంటరప్టెడ్ (ప్రతినెలా అంతరాయం)

ఎవ్రీ మంత్ ఇన్ డెటెడ్ (ప్రతినెలా అప్పులు)

## 'దేశ ప్రజల దుర్భర జీవితానికి కాంగ్రెస్సే కారణం'

న్యూఢిల్లీ

యూపీఏ హయాంలో ప్రజలపై పన్నుల భారం ఎక్కువగా ప్రధాని మోదీ అన్నారు. సామాన్యులపై నిత్యావసర వస్తువుల భారం తగ్గించేలా జీఎస్టీ రేట్ల స్వరూపంలో కేంద్రం కీలక మార్పులు చేసింది. ఈ తరుణంలో కొత్త జీఎస్టీ స్లాబ్‌లపై ప్రధాని మోదీ స్పందించారు.

జీఎస్టీ స్లాబ్ సంస్కరణలతో అందరికి ప్రయోజనం.దేశ చరిత్రలో ఇదో మైలురాయి. జీఎస్టీ సంస్కరణలతో దేశం మరింత బలపడుతుంది. నిత్యవసర వస్తువులు తగ్గుతాయి. సమయాన్ని బట్టి సంస్కరణలు అవసరం. యూపీఏ హయాంలోనే అధిక పన్నులు. గతంతో పన్నుల రూపంలో కాంగ్రెస్ నేతలు దోచుకున్నారు. దేశ చరిత్రలో ఇదొకమైలురాయి. దేశ ప్రజల దుర్భర జీవితానికి కాంగ్రెస్సే కారణం. జీఎస్టీ స్లాబుల సవరణలతో జీఎస్టీ సంస్కరణలతో దివాళి గిఫ్ట్ ఇచ్చాం అని అన్నారు.

వస్తు-సేవల పన్ను రేట్లలో సంస్కరణలపై ప్రధాని మోదీ స్పందించారు. దేశాన్ని స్వావలంబన దిశగా మార్చడానికి తదుపరి తరం సంస్కరణలు అవసరమని భావించామని, ఇందుకు అనుగుణంగానే తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. దీపావళి, ఛత్‌పూజకు ముందే ప్రజలకు రెట్టింపు ఆనందం ఉంటుందని హామీ ఇచ్చామని.. చెప్పినట్లుగానే ప్రజలకు సంతోషకరమైన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. జాతీయ అవార్డులు పొందిన టీచర్లను ఉద్దేశించి మాట్లాడిన మోదీ (%చీఖతీవఅఊథు వీశీఉఱ%).. పన్నులపై కాంగ్రెస్ అనుసరించిన తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చిన్నారుల చాక్లెట్ల నుంచీ ప్రతి వస్తువుపైనా భారీగా పన్ను వసూలు చేసిందన్నారు.

"కాంగ్రెస్ హయాంలో భారీగా పన్నులు వేశారు. చిన్నారుల చాక్లెట్లపైనా 21శాతం పన్ను వసూలు చేశారు. నేనే ఆ పని చేసివుంటే.. నాపై తీవ్ర విమర్శలు చేసేవారు. మా ప్రభుత్వ విధానం మాత్రం ప్రజలకు అనుకూలంగా వెళ్లడమే. నవరాత్రి తొలి రోజు నుంచే జీఎస్టీ కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా ఆర్థిక వ్యవస్థకు కొత్తగా పంచరత్నాలను జోడించాం. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో పేదలు, మధ్యతరగతి, మహిళలు, విద్యార్థులు, రైతులు, యువత.. ప్రతిఒక్కరికీ ప్రయోజనం ఉంటుంది. వీటివల్ల మరింత ముందుగానే ఆత్మనిర్భర భారత్ సాకారమవుతుంది.

హెయిర్‌క్లిప్‌లు కూడా విదేశాల నుంచి తెచ్చుకునే విధానం మారాలి. ప్రస్తుతం రూ.లక్ష కోట్ల విలువైన వంటనూనె దిగుమతి చేసుకుంటున్నాం. ఇంత మొత్తం బయటకు వెళ్లకుండా ఆపగలిగితే ఎన్నో పాఠశాలలు నిర్మించుకోవచ్చు. చంద్రయాన్ విజయంతో శాస్త్రవేత్తలు కావాలనే కాంక్ష మన విద్యార్థుల్లో పెరిగింది. నూతన ఆవిష్కరణలకు సమయం ఆసన్నమైంది. టీచర్లు విద్యాబుద్ధులు నేర్పడమే కాదు.. యువతరానికి దారి చూపాలి. చిన్నారుల్లో డిజిటల్ దుష్ప్రభావాన్ని కూడా తగ్గించే బాధ్యత మనపై ఉంది. గ్యాంబ్లింగ్ విషయంలో ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. గాంధీజీ నినాదం స్వదేశీ.. దాన్ని అందరం అమలు చేద్దాం. దేశీయ ఉత్పత్తుల వినియోగంతో దేశ రూపురేఖలు మారిపోతాయి. మేడిన్ ఇండియాపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలి. మనదేశంలో తయారైన వస్తువులనే వాడాలి. ఇందుకు సంబంధించి ప్రతి ఇల్లు, దుకాణం బయట బోర్డులు కనిపించాలి" అని పిలుపునిచ్చారు.

## మోదీ బ్రహ్మాస్త్రం జీఎస్టీ

న్యూఢిల్లీ

సామాన్యులకు ఊరటనిచ్చేలా జీఎస్టీ రేట్లను సవరిస్తూ జీఎస్టీ కౌన్సిల్ చేసిన ప్రకటన ప్రధాని మోదీ వేసిన బ్రహ్మాస్త్రమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కేంద్రంతోపాటు రాష్ట్రాలపై అదనపు భా రం పడుతున్నా.. కేంద్రం, ప్రధాని మోదీ రాజకీయంగా లబ్ధి పొందనున్నారని చెబుతున్నారు. దీపావళికి ముందే బిహార్ ఎన్నికల షెడ్యూల్ వెలువడనుండడంతో జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయాన్ని ముందుగానే ప్రకటించారని, దీంతో ప్రతిపక్షాలన్నీ ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడ్డాయంటున్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల రాష్ట్రాల ఆదాయం తగ్గుతుందని, తమకు నష్టపరిహారం చెల్లించాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు తొలుత నిర్ణయించాయి. కానీ, జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రకటన తర్వాత వెనక్కు తగ్గాయి. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సహా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల నేతలు తొలుత విడుదల చేసిన పత్రికా ప్రకటనలను వెనక్కి తీసుకుని సవరించిన ప్రకటనలను విడుదల చేయడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ మంత్రి భట్టి విక్రమార్కతోపాటు తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నెరసు జీఎస్టీ తగ్గింపును స్వాగతించారు. ఇక, గత బడ్జెట్‌లో ఆదాయ పన్నును తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న తర్వాత జీఎస్టీ రేట్లపై కోత విధించడం కేంద్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన రెండో అతి పెద్ద బహుమతి అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న బిహార్, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో జీఎస్టీ అంశం బీజేపీకి బాగా కలిసొస్తుందని అంచనా వేస్తున్నారు.

## అయోధ్య రామాలయానికి హైటెక్ భద్రత!


ఇంటర్నెట్ డెస్క్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయానికి హైటెక్ సెక్యూరిటీ ఏర్పాటు చేయనున్నారు. ఆలయంలో భద్రత ఏర్పాట్లను సమీక్షించేందుకు జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పీ తదితర ఉన్నతాధికారులతో కూడిన సెక్యూరిటీ కమిటీ నేడు సమావేశమైంది. హైటెక్ భద్రతా పరికరాల ఆవశ్యకతను వివరిస్తూ రూపొందించిన ప్రతిపాదనలను ఈ సందర్భంగా ఖరారు చేశారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం పంపుతామని జిల్లా మేజిస్ట్రేట్ నిఖిల్ టికారం ఫండే తెలిపారు.

ఆలయ నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నందున.. భద్రతకు సంబంధించి కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయని ఫండే వెల్లడించారు. వాటిని పరిష్కరించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రామజన్మభూమి చాలాకాలంగా ఉగ్రవాదుల టార్గెటెడ్ లిస్టులో ఉందని, ఒకవేళ ఏదైనా అనుకోని ఘటన చోటుచేసుకుంటే తిప్పికొట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని ఎస్పీ బీసీ దుబే చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో తనిఖీలు చేపట్టడంతోపాటు, ప్రస్తుతం కొనసాగుతున్న ఆలయ పనులను సమీక్షించారు.

## లబ్ధిని వినియోగదారులకు అందించండి

న్యూఢిల్లీ




వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. జీఎస్టీ తగ్గింపు లబ్ధిని పూర్తి స్థాయిలో ప్రజలకు అందించాలని పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని మంత్రి పేర్కొన్నారు. దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందన్నారు. ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ సంస్కరణలు దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని గోయల్ చెప్పారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించా లని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి గోయల్ మాట్లాడారు

# చోటా,వేలంగిణి గ్లోబల్ పాఠశాలలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

-ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనది...

-ప్రధానోపాధ్యాయులు టి. క్రాంతి కుమార్

**చౌటుప్పల్.సెప్టెంబర్ 4. ప్రభాత సూర్య :** విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని వేలంగిణి గ్లోబల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ క్రాంత్ కుమార్ అన్నారు.పట్టణ కేంద్రంలోని చోట, వెలంగిణి గ్లోబల్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా టి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గొప్పతనాన్ని, ఆయన ఉపాధ్యాయులకు ఎందుకు మార్గదర్శకులు అనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకోని ఉపాధ్యాయ వృత్తికి





గౌరవం తీసుకురావాలన్నారు.ఒక వ్యక్తి,సమాజ,జాతి నడకకు,నడతకు, పురోగతికి,శ్రేయసుకు గురువు మార్గదర్శనం తప్పనిసరిని విద్యార్థులకు తెలిపారు.గురువు మన జీవితానికి వెలుగు చూపే దీపం లాంటివాడని అటువంటి ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించాలని సూచించారు.శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు టి క్రాంతి కుమార్ ను,



ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు స్వపరిపాలన దినోత్సవం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీ.క్రాంత్ కుమార్, మహిళ ఉపాధ్యాయులు శ్రావణి, మౌనిక, శ్రీలత,సహస్ర, నీరజ, కృష్ణవేణి, భబీత, అఖిల, నాగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలలో యుగంధర్ రెడ్డి ప్రత్యేక పూజలు




**బాలానగర్, సెప్టెంబర్ 04 (ప్రభాత సూర్య) :**కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ కళ్యాణ్ నగర్ లో శివ పార్వతి యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ప్రత్యేక పూజ నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్, జనార్ధన్, నరేందర్, స్వాతి, మమత, త్రిలోచన్, ప్రమోద్, వికాస్, కుముద్, పవన్, మురళి, రాఖీ, సింహాద్రి, స్వదీప్ మోహన్ నాయుడు, శ్రీను, సాయి, మైనారిటీ నాయకుడు ముక్తార్ అహ్మద్, అధిక సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ సహకార సంఘానికి అభినందనలు




**తుర్కయంజాల్, సెప్టెంబర్ 04, ప్రభాత సూర్య:** తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ప్రజలకు అందిస్తున్న సేవలను ఉత్తరప్రదేశ్, తమిళనాడు సహకార సంఘ అధికారులు అభినందించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సహకార సమ్మిట్‌లో భాగంగా తుర్కయంజాల్ ఎఫ్ ఎస్ సీ ఎస్ ను యూపీ సహకార సంఘ కమిషనర్ యోగేష్ కుమార్, తమిళనాడు సహకార సంఘ కమిషనర్ సంత కుమార్ సందర్శించారు. గోడౌన్ల ప్రాంగణంలో మొక్కలను నాటారు. టీజీ కాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి కోహెడలో రైతుల కోసం నిర్మించిన గోడౌన్ల సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల శ్రేయస్సు కోసం అందిస్తున్న సేవలను కొనియాడారు. సంఘం పనితీరును, సభ్యులకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జూనియర్ డీసీవో సి.సుధాకర్, సూపరింటెండెంట్ బి.నాగేశ్వరరావు, సంఘ సెక్రటరీ వై.రాందాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## సోమరాజుగూడలో వినూత్నంగా గణనాథుని నిమజ్జనం



**గట్టుప్పల్ ప్రభాత సూర్య 4** నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం సోమరాజుగూడలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వినూత్నంగా ముగిశాయి. బాలాంజనేయ స్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన గణనాథుడిని జెసిబి ద్వారా నిమజ్జనానికి బయలుదేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామస్థులు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా లడ్డు వేలం పాట లో పెద్ద గౌడ్ నర్సింగ్ కృష్ణయ్య గౌడ్ ?32,500 విలువైన లడ్డును కైవసం చేసుకున్నాడు నిమజ్జన శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

-మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

-కళాశాల ప్రిన్సిపల్ బి. మహేందర్ రెడ్డి

**చౌటుప్పల్.సెప్టెంబర్ 04. ప్రభాత సూర్య :** విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని మాతృశ్రీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. మహేందర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణ మున్సిపాలిటీ కేంద్రంలోని స్మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీ మహేందర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, కళాశాల విద్యార్థులతో కలిసి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవంను తమ కళాశాలలో ఒకరోజు ముందుగా తమ అధ్యాపక బృందాన్ని శాలువాలతో ప్రిన్సిపాల్ బి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.... విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దటంలో గురువుల కృషి వెలకట్టలేనిదన్నారు. విద్యార్థుల పట్టుదలకు, సాధించాలనే తపనకు గురువు మార్గదర్శకం తోడైతే వారు ఉన్నత



శిఖరాలను అధిరోహించగలరన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నా,ఒక తరాన్ని ముందుకు నడిపించాలన్న అది గురువులకే సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులు గురువులు నేర్పే విద్యా బుద్దులతో భవిష్యత్తులో గొప్పగా ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు గొప్ప పేరు తెచ్చిపెట్టేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు తమ గురుభక్తిని చాటుతూ ప్రదర్శించిన కార్యక్రమాలు, ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## సీనియర్ ఎల్ఐసి ఏజెంట్ సిలివేరు వీరేశం కు ఘనంగా సన్మానం.

**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 04( ప్రభుత్వ సూర్య):** ఎల్ఐసి ఏజెంట్ గా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సిలివేరు వీరేశం 35 సంవత్సరాలుగా ఎల్ఐసి ఏజెంట్ సర్వీసును పూర్తి చేసుకున్నారు. 2000 మంది పాలసీదారులకు సేవలు అందిస్తున్నారు. ఎల్ఐసి సంస్థ ఏర్పడి 69 సంవత్సరాలు పూర్తయింది. సెప్టెంబర్ ఒకటి నుంచి వారం రోజులపాటు భీమా వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ ఏజెంట్ గా ఉన్న నన్ను రోజు చౌటుప్పల్ ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించడం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా చౌటుప్పల్ ఎంఈఓ గురువారావు, చౌటుప్పల ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ హిమాన్షు, డెవలప్మెంట్ ఆఫీసర్లు అప్పారావు, రవికుమార్,




శ్రీనివాస్, గంగాధర్, చక్రవర్తి, మహేష్, ఎల్ఐసి ఉద్యోగులు, ఎల్ఐసి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.25 లక్షలు పలికిన కాటేదాన్ బంగారు మైసమ్మ దేవాలయం గణేష్ లడ్డూ

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్.

పోటాపోటీ వేలంలో వరుసగా 3 వసారి లడ్డూ కైవసం చేసుకున్న ఇందిరాగాంధీ సొ సైటీ అధ్యక్షుడు సంకూరి జయప్రకాష్. గండిపేట్: సూర్య ప్రతినిధి కాటేదాన్ శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో పూజలు అందుకున్న గణనాథుని లడ్డూ ఈ ఏడాది కూడా రికార్డు ధర పలికింది. గురువారం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆలయం ఆవరణలో నెలకొల్పిన గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన సమక్షంలోనే ఉత్సవ కమిటీ లడ్డూ వేలం నిర్వహించింది. ఈ వేలం పాటలో అందరికంటే అధికంగా పాడిన ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సంకూరి జయప్రకాష్ వరుసగా మూడవ సారి లడ్డూను కైవసం చేసుకున్నాడు. జయప్రకాష్ 2023 లో ఇక్కడి లడ్డూను .1,89,000/- సొంత చేసుకోగా, గత ఏదాది రూ.2,01,600/- రెండవ సారి దక్కించుకున్నారు. గురువారం జరిగిన వేలంలో స్థానికులు చాలా మంది పోటా పోటీగా పాల్గొన్నారు. అందరి కంటే అధికంగా రూ.2.25,000/- లకు సంకూరి జయప్రకాష్ వేలంలో పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానికులు అర్ధం లక్ష్మయ్యగుప్త, పులిజాల వివేకానంద, గట్టయ్య, బాస శ్రీనివాస్,తిరుమల వెంకటేష్



గౌడ్, ఉస్కెమూరి శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ప్రజల ఆరోగ్యానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషి

చిమిర్యాల మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 04( ప్రభాత సూర్య ):** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సౌజన్యంతో వారి తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించబడుతుంది. ఈ శిబిరం ద్వారా పేద ప్రజలకు కంటి సమస్యలపై నిపుణుల వైద్య సేవలు, అవసరమైన వారికి కళ్ల అద్దాలు, అవసరమైతే శస్త్రచికిత్సలు కూడా అందించబడతాయి. ఈ కార్యక్రమం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ఒక గొప్ప అడుగు అని కాంగ్రెస్ పార్టీ నాయకులు, చిమిర్యాల




మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. మునుగోడు ప్రజల ఆరోగ్యమే మా ప్రాధాన్యత. ఈ శిబిరం ద్వారా ఎంతోమంది కంటి వెలుగు పొందుతున్నారు. ప్రజల తరఫున శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మనఃపూర్వక కృతజ్ఞతలు. దోనూరు జైపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలను కోరుచున్నాము.

## అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య
- రిపోర్టర్ యోహాన్ గుండె పోటు తో హఠాన్మరణం... దుఃఖంలో పత్రికా విలేకరులు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 04 (ప్రభాత సూర్య)** ‘ఆదాబ్ హైదరాబాద్’ పత్రికలో రిపోర్టర్‌గా పనిచేస్తున్న యోహాన్ బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఆయన మృతి కూకట్ పల్లి పత్రికా వర్గాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్



నాయకుడు గాదె శివ చౌదరి, కూకట్‌పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న చింతల్‌లోని ఆయన నివాసానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎర్ర యాకయ్య మాట్లాడుతూ యోహాన్ మరణం ఉమ్మడి ప్రెస్ క్లబ్ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, వార్తారచనలో యోహాన్ చూపిన నిబద్ధత, అంకితభావం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. యోహాన్ ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని సహచరులు కన్నీటి పర్యంతమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యోహాన్ ఆత్మకు శాంతి చేకూరాలని ఉమ్మడి ప్రెస్ క్లబ్ సభ్యులు చింత నర్సింగ్ రావు, శ్యామ్ సుందర్, ఎస్. రవి కుమార్, కొటేష, ఎర్ర వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా బెస్ట్ టీచర్ గా సుధారాణి

వివరాలు వెల్లడించిన మేడ్చల్ జిల్లా డీఈవో

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04 (ప్రభాత సూర్య) :**జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు విజ్ఞానసుధ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధా రాణి ఎంపికయ్యారు. మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారిని విజయ కుమారి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా లోని ఉత్తమ ఉపాధ్యాయుల వివరాలను వెల్లడించారు. కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీలోని న్యూ వివేకానంద నగర్ లో గల విజ్ఞానసుధ బాధ్యతలు నిర్వహిస్తున్న సుధారాణి బెస్ట్ టీచర్ గా గుర్తింపును పొందారు. 2003 వ సంవత్సరంలో పాఠశాలను స్థాపించి ఎందరో



విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ప్రధానోపాధ్యాయురాలు గా విధులు నిర్వహిస్తూనే పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు విద్యాబోధన చేశారు. 23 సంవత్సరాలుగా తాను చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆమె జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికయింది. బెస్ట్ టీచర్ అవార్డు రావడం పట్ల సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన అపూర్వ గౌరవం అని అన్నారు. పాఠశాల విద్యలో తాను మరింత గౌరవప్రదంగా పనిచేస్తానని వెల్లడించారు.

## అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి

ఎస్ఐ జగన్



**సంస్థాన్ నారాయణపూర, సెప్టెంబర్04( ప్రభాత సూర్య)** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర మండల కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివేకానంద యువ కేంద్ర, హనుమాన్ యూత్, కుమ్మరి వాడ, కింగ్ స్టార్ యూత్ ల వద్ద నెలకొల్పిన గణనాధుల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి స్థానిక ఎస్సై జగన్ పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యువకేంద్రం, హనుమాన్ యూత్ కమిటీ సభ్యులు, కుమ్మరి వాడ కమిటీ సభ్యులు, కింగ్ స్టార్ యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయులు... జ్ఞానజ్యోతి వెలిగించే దీపస్తంభాలు



భారత దేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. ఈ సంప్రదాయం వెనుక ఉన్న మూలకారణం విశిష్ట తాత్వికుడు, గొప్ప విద్యావేత్త, భారతరత్న గ్రహీత, భారతదేశ రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం. ఆయన ఒకసారి "నా పుట్టినరోజు ప్రత్యేకంగా జరపాల్సిన అవసరం లేదు. కానీ నా సేవలను గౌరవించాలనుకుంటే ఆ రోజు దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోండి" అని అన్న సందర్భం నుండి ఈ దినోత్సవానికి శ్రీకారం చుట్ట బడింది. అప్పటి నుండి ప్రతి ఏడాది కోట్లాది మంది విద్యార్థులు తమ గురువులను సత్కరిస్తూ కృతజ్ఞతా నివాళి అర్పించడం ఆనవాయితీగా మారింది. భారతీయ సంప్రదాయంలో ఉపాధ్యాయుని స్థానం అత్యున్నతమైనది. తల్లిదండ్రులు మనకు జీవనాన్ని ఇస్తే ఉపాధ్యాయులు ఆ జీవనానికి జ్ఞానం, దిశా నిర్దేశం అందిస్తారు. శిష్యుడి ఆలోచన విధానాన్ని తీర్చిదిద్దడమే కాకుండా నీతి, నైతికతలు, విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని బోధించడం ఉపాధ్యాయుని గొప్ప కర్తవ్యంగా భావించ బడింది. అందుకే పురాణాలలో, శాస్త్రాలలో "గురు బ్రహ్మ:, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః" అని ఉపాధ్యాయుని స్థాయిని దైవస్థాయిలో ఉంచారు. భారతీయ చరిత్రలో అనేక మంది గురువులు సమాజానికి దిశా నిర్దేశకులుగా నిలిచారు. చాణక్య చంద్రగుప్తుని సామ్రాజ్య నిర్మాతగా తీర్చిదిద్దాడు. ఆదిశంకరాచార్యులు భారతీయ ఆధ్యాత్మికతను పునరుద్ధరించారు. ఆధునిక యుగంలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విద్యా హక్కుల కోసం, ముఖ్యంగా స్త్రీలకు విద్యను అందించేందుకు పోరాడారు. స్వాతంత్ర్యం తర్వాత తొలి విద్యా మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా విధానానికి బలమైన పునాదులు వేశారు. ఈ తరహా మహనీయుల కృషి ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని మరింత పెంచింది. ఈ రోజుల్లో భారతదేశంలో సుమారు 47 లక్షల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వారి కృషిని గుర్తించి రాష్ట్రపతి చేత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేస్తారు. 1962 నుండి ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. 2024లోనే 130 మంది ఉపాధ్యాయులు ఈ గౌరవాన్ని అందుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండీ ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఒక విశిష్ట ఘట్టం. ఈ అవార్డులు ఉపాధ్యాయుల సమర్పణకు, శ్రమకు సామాజిక గుర్తింపును కల్పిస్తున్నాయి. అయితే నేటి యుగంలో ఉపాధ్యాయ వృత్తి సవాళ్లతో నిండినదే. సాంకేతిక పరిణామం వలన విద్యార్థులకు అపారమైన సమాచారం అందుబాటులోకి వచ్చింది. కానీ ఆ సమాచారాన్ని సరైన జ్ఞానంగా మార్చి, ఉపయోగకర దిశలో వినియోగించడం నేర్పేది మాత్రం ఉపాధ్యాయుడే. తల్లిదండ్రులు, సమాజం నుంచి విద్యార్థులపై అధిక మార్కులు, ర్యాంకుల కోసం ఒత్తిడి పెరుగుతున్న క్రమంలో ఉపాధ్యాయులు కేవలం బోధకులే కాకుండా మానసిక బలాన్ని అందించే మార్గదర్శకులుగా మారాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో వనరుల కొరత, మౌలిక సదుపాయాల లేమి కారణంగా అక్కడి ఉపాధ్యాయులు అనేక పాత్రలు పోషిస్తూ విద్యా యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశంతో పాఠ్య పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుం టున్నాయి. విద్యార్థి కేంద్రిత బోధన, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మక ఆలోచనలపై దృష్టి పెట్టాల్సిన అవసరం వచ్చింది. ఈ కొత్త విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు సరికొత్త శిక్షణలు పొందుతూ, సాంకేతిక వనరులు వినియోగిస్తూ ముందుకు సాగుతున్నారు. విద్యావేత్త డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఒకసారి "ఒక గొప్ప ఉపాధ్యాయుడు దేశ భవిష్యత్తును నిర్మించ గలడు. విద్యార్థి మనసులో మంట వెలిగించగల శక్తి గురువుకే ఉంటుంది" అన్నారు. మహాత్మా గాంధీ "విద్య అనేది మనిషి శరీర, మానసిక, ఆత్మిక పరిమాణాల సమగ్ర అభివృద్ధి" అని చెప్పిన మాట ఉపాధ్యాయుని పాత్రను మరింత స్పష్టంగా తెలియజేస్తుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు తమ గురువులను సత్కరించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఒక సంప్రదాయంగా మారింది. విద్యార్థులు ఒక రోజు పాటు ఉపాధ్యాయుల పాత్రను పోషించడం ద్వారా గౌరవాన్ని వ్యక్తపరుస్తారు. ఇది గురువుల పట్ల కృతజ్ఞతా భావాన్ని మాత్రమే కాక, ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని గుర్తు చేస్తుంది. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా, కృత్రిమ మేధస్సు ఎంత విస్తరించినా ఉపాధ్యాయుని స్థానాన్ని మరెవ్వరూ భర్తీ చేయలేరు. యంత్రాలు సమాచారం అందించగలవు కానీ ఆ సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవడం నేర్పేది మాత్రం ఉపాధ్యాయుడే. అందువల్ల ఉపాధ్యాయ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు. ఇది సమాజాన్ని జ్ఞానవంతం చేసి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల మహోన్నత సేవలకు సమాజం తరపున అర్పించే కృతజ్ఞతా నివాళి.

# గురుః సాక్షాత్ పరబ్రహ్మ!




ఒక సామాన్య మానవున్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చగల ధీర మేధావి గురువు. తొలి అక్షరం దిద్దించడం, వ్యక్తిత్వ వక్రగుణాలను సవరిస్తూ, సన్మార్గాలను చూపుతూ, అత్యున్నత స్థాయికి ఎదిగే వరకు మన వెంట నిడిచి, వెన్నెముకలా నిలిచి, నిరాశలో ఆశల విత్తులు నాటుతూ, కొవ్వొత్తిలా తను కరిగిపోతూ రేపటి తరానికి దారి దీపంగా నిలుస్తూ, తడబడినపుడు ఊత కర్రగా మారగల మహోన్నత దైవ రూపం, నడిచే ఆదర్శాల నిధి గురువు మాత్రమే. పాఠ్యాంశాలను బోధిస్తూ, వెన్నుతట్టి నడక, నడతల్ని నేర్పుతూ, జ్ఞానోదయాన్ని కలిగించగల నిస్వార్థ జీవి ఉపాధ్యాయుడు. ఢిల్లీకి రాజైన సద్గురువుకు పాదాభివందనం చేసేది భాధ్యతగల శిష్యయుడే. పెరిగే మొక్కకు ఊత కర్ర ఉపాధ్యాయుడు. భగవంతుడితో భక్తుడి సంబంధం లాంటిదే గురు శిష్యుల పరమ పవిత్ర సంబంధం. గురువులు సృష్టి కర్త వంటి వారు. విద్యార్థికి జ్ఞానాన్ని అందించి, కొత్త విషయాలను నేర్పించే పాత్రను పోషిస్తారు. గురువు మార్గ నిర్దేశనం చేస్తూ, మోక్షం వైపు నడిపిస్తారు. గురువు పరంధాముడు, అజ్ఞాన చీకట్లను చిదిమేసి జ్ఞానోదయం కలిగించే వారు. గురువు పరివర్తకుడు, భవిష్యత్తు తీర్చిదిద్దే మేధావి. ఉపాధ్యాయుడు రేపటి తరం నిర్మాతలు. తరగతి గదుల్లోనే జాతి నిర్మాణం జరుగుతుంది. గురువుకను నమ్మిన శిష్యుడికి ఎదురుండదు. గురువు ప్రాధాన్యాన్ని గుర్తించిన డా: సర్వేపల్లి రాధాకృష్ణన్ సూచన మేరకు తన పుట్టిన రోజును భారతదేశ "జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (నేషనల్ టీచర్స్ డే)"గా పాటించడం 1992 నుంచి ఆనవాయితీగా మారింది. విజ్ఞానం, లోక జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, వివేకం, విద్యాబుద్ధులు, శాస్త్రీయ దృక్పథం, మంచి అలవాట్లు, ప్రేరణ కల్పించడం, పొరపాట్లను నిర్దయగా సవరించడం, కెరీర్ నిర్మించడం లాంటి బహుముఖీల లక్ష్యాలను మదిలో నింపుకొని తమ విధులను సక్రమంగా, పవిత్రంగా నిర్వహించే గురువులు శిష్యుల దృష్టిలో బ్రహ్మ సమానులే. పుస్తకాల్లో పాఠాలను మాత్రమే బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులు. పాఠ్యాంశాలతో పాటు హృదయపూర్వకంగా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే మహాముభావులు మాత్రమే సద్గురువులు. పిల్లల్లో దయ, కరుణ, ఉత్సుకత, ధైర్యం, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ అనబడే విత్తులు నాటి నీడనిచ్చే మహా వృక్షాలుగా మార్చగల మహోన్నతులు సద్గురువులు. ఓపిక, బేషరతు త్యాగాల ప్రతిరూపం ఉపాధ్యాయులు. 05 సెప్టెంబర్ 1888 రోజున తికుత్తని, తమిళనాడులో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన రాధాకృష్ణన్, చిన్నతనం నుంచే అత్యుత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. పాఠశాల విద్య అనంతరం మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో ఉన్నత విద్య పూర్తి చేశారు. అనంతరం మైసూర్ యూనివర్సిటీ, కలకత్తా యూనివర్సిటీల్లో అధ్యాపకుడిగా సేవలు అందించిన పిదప ఆంధ్ర, ఢిల్లీ, బెనారస్ హిందూ యూనివర్సిటీలకు విసిగా సేవలు అందించారు. ఆక్సఫర్డ్, చికాగో యూనివర్సిటీలతో పాటు యునెస్కో బోర్డులో తన సత్తా చాటారు. డా: రాధాకృష్ణన్ అద్వితీయ మేధో సంపత్తిని గుర్తించిన భారత ప్రభుత్వం 1952లో భారత ఉపరాష్ట్రపతిగా ఎంపిక చేసుకోవడం జరిగింది. అదే క్రమంలో 1954లో దేశ రెండవ రాష్ట్రపతిగా 1967 వరకు విశేష సేవలు అందించారు. యునెస్కో చొరవతో 05 అక్టోబర్న ప్రతి ఏట "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం" జరుపుకోవడం కూడా కొనసాగుతున్నది. 1954లో భారత రత్న స్వీకరించిన రాధాకృష్ణన్, 16 వర్యాయాలు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఫిలాసఫీలో లోతైన పరిజ్ఞానం కలిగిన రాధాకృష్ణన్, తన జీవితకాలంలో పలు ప్రఖ్యాత పుస్తకాలు రచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేదికగా మన గురువులకు కృతజ్ఞతలు తెలపడం, వారి దీవెనలు పొందడం, వారిని మనస్ఫూర్తిగా సన్మానించడం, సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రేమపూర్వకంగా ఉత్తరాలు రాయడం, విద్యాలయాల్లో సెల్ఫ్ గవర్నమెంటు డే పాటించడం, వారి సేవలను కొనియాడడం, విద్యాలయాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. నిస్వార్థ ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను తెలు పడానికి ఈ వేదిక ఎంతగానో ఉపకరిస్తుందని గమనించాలి. కంచే చేనును మెసినట్లు, నేటి ఉపాధ్యాయుల్లో కొందరు విధులను నిర్లక్ష్యం చేయడం, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం, విధి నిర్వహణలో ఆల్కహాల్ సేవించడం, కాలక్షేపం కోసం ఉద్యోగం చేయడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం అత్యంత విచారకరం. రేపటి తరం నిర్మాతలుగా నేటి ఉపాధ్యాయులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి డిజిటల్-ఏఐ తరగతి గదుల్లో సాంప్రదాయంతో బోధనలు చేయడానికి ముందుకు రావాలని, ప్రతి విద్యార్థిని బాధ్యతగల పౌరులుగా మార్చడానికి కృషి చేయాలని కోరుకుందాం.

## పత్రికల పంపిణీలో పేపర్ బాయ్స్ నిరుపమాన సేవలు

ఆధునిక సమాజంలో ప్రింట్ మీడియా కన్నా సోషల్ మీడియా వేగవంతంగా ముందుకు సాగుతోంది. స్మార్ట్ ఫోన్ లు అందుబాటు లోకి వచ్చాక డిజిటల్ యుగంలో సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం నానాటికీ పెరిగిపోతోంది. అప్డేట్స్ తో వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ మాధ్యమాల ద్వారా విషయం వెనువెంటనే బహిరంగం అవుతుండగా, ప్రింట్ మీడియా వాటి వేగానికి, టెక్నిక్స్ కు పోటీ పడలేక పోతోంది. లైవ్ వీడియోలతో వస్తున్న అంశాలు, బ్రేకింగ్ న్యూస్ కోసం అధిక సంఖ్యాకులు ప్రభావితులు అవుతున్నారన్నది వాస్తవం. నేటి వార్త తెల్లవారి మార్కెట్ లోకి ప్రచురితం అయి వచ్చే సాంప్రదాయ పత్రికల కోసం చాలామంది ఎదిరి చూసే పరిస్థితులు కనిపించడం బాధాకరం. ఒకనాడు నిత్యం ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా ప్రజలకు వార్తా పత్రికలు మాత్రమే చెరవేసేవి. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్యవర్తిత్వం వహిస్తూ వారథులుగా పత్రికలు పని చేసేవి. ప్రజా బాహుళ్యానికి నిత్యం చైతన్య పరుస్తూ, ప్రగతికి బాటలు వేసేవి. అలాంటి స్థితిలో పత్రికలు పాఠకునికి చేర్చడంలో కీలక పాత్ర పోషించింది నిస్సందేహంగా పేపర్ బాయ్. తొలి పేపర్ బాయ్గా గుర్తింపు పొందిన బార్నీ ప్లాహెర్టీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా సెప్టెంబరు 4న అంతర్జాతీయ పేపర్బాయ్ దినోత్సవం జరుపుతున్నారు. నియమిత స్థలాల్లో పాత్రికేయులు ఆహరహం శ్రమించి, సేకరించి పంపిన వార్తలను ఉప సంపాదకులు సరిచేసి, సంపాదకుని ఆమోద ముద్ర పడిన తర్వాత ముద్రణకు రంగం సిద్ధం చేశాక, ముద్రిత దిన పత్రికలను పాఠకులకు చేరవేయడంలో పేపర్బాయ్ల కష్టాలు, ఇబ్బందులు అందరికీ తెలిసిందే.

## యాదాద్రి స్టార్ వన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుడి నిమజ్జనం

మహాదేవపురం కాలనీ లో లడ్డు వేలంపాట

రూ.75000 లకు దక్కించుకున్న కల్పతరు సామల్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04 (ప్రభాత సూర్య) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గాజుల రామరారం డివిజన్ పరిధిలోని యాదాద్రి స్టార్ వన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన భారీ గణపతి లడ్డు వేలం పాట గురువారం అట్టహాసంగా జరిగింది. పోటాపోటీగా జరిగిన వేలంపాటలో కల్పతరు సామల్, స్వాగతిక దంపతులు రూ.75000 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నాడు. అనంతరం డప్పు వాయిద్యాలతో, హారతి ఇంటి వరకు కాలనీ ప్రజలందరూ గణపతి పప్పా మోరియా అంటూ వారి ఇంటి వరకు సాగనంపారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని యాదాద్రి స్టార్ వన్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు, యూత్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి స్టార్ వన్ అధ్యక్షులు మారెడ్డి సాయి రెడ్డి, కోటగడ్డ శ్రీనివాస్, సిహెచ్ లక్ష్మణరావు, కట్కూరి శ్రీనివాస్, ఉపేందర్, ఏటుకూరి గోపాల్, సౌమ్య రంజన్ మాలిక్, కోటగడ్డ నరసింహులు, ఠాగూర్ సాయి చరణ్ సింగ్, ఉదావోలు శ్రావణ్ కుమార్, ఠాగూర్ సుమన, గొట్టిముక్కల శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, సత్య మణికంఠ గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దాతృత్వానికి ప్రతీక

అమ్మ అంటే త్యాగం. అమ్మ అంటే నమ్మకం. అమ్మ అంటే కరుణ. అమ్మ అంటే అనంతమైన ప్రేమ. కన్న తల్లి బిడ్డల కడుపు చూస్తుంది. అమ్మ చేతి స్పర్శ విశ్వాసాన్ని కూర్చే ఔషధం. ప్రేగు బంధం పెనవేసుకున్న అమ్మకు మించిన దైవం లేదు. అమ్మ హస్తం అమృత తుల్యం. కన్న తల్లి ప్రేమను కురిపించడం సర్వసాధారణం. అమ్మ కాని అమ్మలు కూడా తల్లిని మరిపించి, సకల సపర్యలు చేస్తే అదో అద్భుతం, కనివిని ఎరుగని విశేషం. అవసరార్థులు, ఆకలితో అలమటించే అభాగ్యులు, తీవ్ర రోగాల బారిన పడి జీవచ్ఛవంలా బతుకులను ఈడుస్తున్న కడు పేదలకు తానే కన్న తల్లిగా మారి, సకల సపర్యలు చేసి, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడగలగడం ఆమెకే సొంతం. ఆమె జీవితం అవసరార్థులకే అంకితం. ఆమె ఓ ప్రపంచ శాంతిదూత, ఓ ఆపన్నహస్తం, స్వచ్ఛంద నేస్తం. ఆమె ఎవరో కాదు పేరులోనే తల్లిని ఇముడ్చుకున్న మహోన్నత మహిళ, మదర్ థెరిస్సా. అసాధారణ, అత్యుత్తమ శ్రేణి మహిళ మదర్ థెరిసా పేద బడుగు బలహీన వర్గాల శ్రేయస్సుకు పాటుపడిన కారణంగా ప్రపంచ దాతృత్వ గుణానికి ప్రతీకగా నిలిచిన నొబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా వర్ధంతి సందర్భంగా 2012 నుంచి ప్రతి ఏట 05 సెప్టెంబర్ రోజున "అంతర్జాతీయ దాతృత్వ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ చారిటీ)" పాటించారని ఐరాస నిర్ణయించడం ముదావహం. సామాజిక బాధ్యతను తట్టి లేపడం, దాతృత్వ చర్యలకు ప్రేరణనివ్వడంతో పాటు మానవాళి ఎదుర్కొంటున్న పేదరికం, ఆకలి చావులు, విద్య, సంక్షేమం లాంటి సమస్యల పట్ల పౌర సమాజాన్ని జాగృత పరచడం లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న సేవలు కూడా పెద్ద మార్పుకు నాంది పలుకుతాయని కూడా ప్రచారం చేయడం జరుగుతుంది. పేదరిక నిర్మూలన, పీడిత జనాల రక్షణ, ఆకలి కేకలకు అన్నం ముద్ద అందించడం, గాయపడిన గుండెలకు సాంత్వన కూర్చడం, సహానుభూతితో సమస్యలకు పరిష్కారం చూపడం లాంటి లక్ష్యంతో మదర్ థెరిసా తన జీవితాన్ని ఆసాంతం అవసర ప్రజా సేవకు అంకితం చేసారు. మదర్ థెరిసా జీవితం దాతృత్వ ఔదార్య స్ఫూర్తిని రగిలించడం జరుగుతోంది. అంతర్జాత దాతృత్వ దినం - 2025 ఇతివృత్తంగా "పేదరిక నిర్మూలనలో ప్రపంచ సంఘీభావం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. 26 ఆగస్టు 1910 పుణ్య గడియల్లో స్కోప్జీ, మర్సిడోనియాలో జన్మించిన మదర్ థెరిస్సా అసలు పేరు "అగ్నెస్ గోంక్సహ బొజాక్సిహివూ". ఆమె 27 ఆగస్టు రోజున బాప్టిజమ్ స్వీకరించడం జరిగింది. చిన్నారి చిన్నతనంలా నుంచే మిషనరీల్లో సేవలు చేయడం ప్రారంభించింది. అవసరార్థులు, అనాధలు, దీర్ఘకాలిక రోగులకు సేవలు చేయడానికి 1928లో ఇంటిని వదిలి 'సిస్టర్స్ ఆఫ్ లొరెటో'లో చేరి ఇండియాలో సేవలు అందించడానికి అంకితం అయి పోయింది. నన్స్ విభాగంలో శిక్షణ అనంతరం కలకత్తాలోని పాఠశాలలో టీచర్గా 1931 నుంచి 1948 వరకు సేవలు అందించింది. ఈ కాలంలో పేదరికాన్ని చూసి చలించిపోయి, శాశ్వతంగా సేవామార్గాన్ని నిర్ణయించుకుంది. 1950లో "మిషనరీస్ ఆఫ్ చారిటీ, కలకత్తా"ను ఏర్పాటు చేసి ఒక సమూహాన్ని ఏర్పరచుకొని మురికి వాడల్లో మగ్గుతున్న కడు పేదలకు స్వచ్ఛందంగా సేవలు చేయడం, విద్య బోధించం, ఆకలి తీర్చడం, రోగులకు ఉపశమన సేవలు చేయడం ప్రారంభించింది. తను నిర్మించిన మిషనరీ సామ్రాజ్యం 130కి పైగా దేశాలకు విస్తరించి లక్షలాది సేవకులకు కేంద్రంగా మారింది. ఇండ్లు లేని వీధి బాలలకు తానే అమ్మగా మారి సకల సపర్యలు చేసి,

# వృక్షాలను పెంచడం మనందరి బాధ్యత

**-సిడిఎంఏ జాయిన్ డైరెక్టర్ నారాయణరావు**
**-చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి**

**చౌటుప్పల్.సెప్టెంబర్ 4. ప్రభాత సూర్య :** ప్రతి ఒక్కరూ వృక్షాలను రక్షిస్తే, మన జీవితకాలం వృక్షాలు మనల్ని కాపాడతాయని సిడిఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు అన్నారు. 100,రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని ప్రైమరీ స్కూల్ లో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి, పాఠశాల విద్యార్థులతో కలిసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జెడి నారాయణరావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి భవిష్యత్తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందివ్వాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అన్నారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. కరువుకాలం సంభవిస్తుందంటే వృక్షాలను పెంచకపోవడం వలన కరువు అనేది ఏర్పడుతున్నది అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. నాటడమే కాకుండా పెంచి పెద్ద చేసే బాధ్యత తీసుకోవాలని గుర్తు చేశారు. విద్యార్థులకు వారి చేతుల మీదుగా మొక్కలను అందించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయములో వార్డు ఆఫీసర్లకు, బిల్ కలెక్టర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీఎంఏ జేడీ నారాయణరావు పాల్గొని ప్రాపర్టీ టాక్స్, ట్రేడ్ లైన్స్, వాటర్ టాక్స్, గురించి సంబంధించిన వివరాలను ఆర్.పి లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్,ఈఈ రేణు కుమార్, జవాన్ నరసింహ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# గ్రీన్ గ్రోవ్ లో ఘనంగా గురు పూజోత్సవం

**-జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**
**-పాఠశాల చైర్ పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి**

**చౌటుప్పల్.సెప్టెంబర్ 04. ప్రభాత సూర్య:**ఁచౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో సెప్టెంబర్ 5 శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినంను పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలకు సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల చైర్ పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గురుపూజోత్సవంలో భాగంగా పాఠశాల చైర్పర్సన్ బండి వీణా అనిల్ కుమార్ రెడ్డి ని అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి ఉపాధ్యాయుల ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల డైరెక్టర్ ఎస్.లక్ష్మి మాట్లాడుతూ... విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.



# శ్రీ గణేష్ గల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ డివిజన్ పరిదిలో లో నీ గుట్టల బేగంపేట్ లో నీ శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రజాప్రనిధులు స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు.ముఖ్య అతిథిగా శేర్లింగంపల్లి నియోజకవర్గం ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ గణేష యూత్ అసోసియేషన్ ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ యూత్ అసోసియేషన్ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# కురుమ సంగం భవనానికి నిధులు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా

**గట్టుప్పల్ ప్రభాతసూర్య4** నల్గొండ జిల్లా ఘట్టుప్పల్ మండల కేంద్రంలోని కురుమ సంగం భవనానికి స్థానిక ఎమ్మెల్యే శ్రీ రాజగోపాల్ రెడ్డి గారి నిధుల సహకారంతో రూ. 5,00,000 (ఐదు లక్షల రూపాయలు) కేటాయించారు. ఈ నిధులతో భవన మిలిగిన పనులు చేపట్టనున్నారు. కురుమ సంగం అధ్యక్షుడు కుండే సత్తయ్య ఆధ్వర్యంలో భవన శంకుస్థాపన కార్యక్రమం కొబ్బరికాయ కొట్టి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ 'ఈ నిధుల మంజూరుకు సహకరించిన గట్టుప్పల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు దండు యాదగిరి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నామాని జగన్నాథం, ఉపాధ్యక్షుడు రావుల రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు సామల యాదయ్య గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంగం నాయకులు కుండే చిన్న సత్తయ్య, పెద్ద కురుమ శ్రీశైలం, చెళోజి మల్లేష్, బందారు శ్రీశైలం, వెంకటేష్, మందుల అశోక్, శంకర్, నరేష్, బోడిసె సత్యనారాయణ, బండ వేణు, కుండే రాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.







# ముత్తిరెడ్డిగూడెంలో ప్రభుత్వ భూమిని, అనాజిపురంలో ఏటి కాలువను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**- సిపిఎం డిమాండ్**

**భువనగిరి, సెప్టెంబర్ 04( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండల ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోని సర్వే నెంబరు 259 లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని పొలం చేసుకుంటున్నా వారి పైన, అనాజిపురం గ్రామంలోని ఏటి కాలువను ఆక్రమించుకున్న వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో అక్రమాన్నికి గురైన ప్రభుత్వ భూమిని, అనాజిపురం గ్రామంలోని ఏటి కాలువను పరిశీలన చేసిన అనంతరం భువనగిరి మండల తహశీల్దార్ అంజిరెడ్డి కి ప్రభుత్వ భూమిని, ఏటి కాలువను పరిరక్షించాలని, అక్రమ దారుల పైన చర్యలు తీసుకోవాలని మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోని సర్వే నెంబరు 259 లోని ప్రభుత్వ భూమి గ్రామంలోని రైతులకు, వృత్తిదారులకు పశు వుల, గొర్ల, మేకల మేతకు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామంలోని మబ్బురాల గుట్ట దగ్గర ప్రభుత్వ భూమిని ఆనుకొని ఉన్న పట్టా భూమిని ఒకతను కొనుగోలు చేసి ఆ భూమితో పాటు ప్రభుత్వ భూమిని కూడా తవ్వి పొలాలను అచ్చు కడుతున్నాడని, హద్దురాలను కూడా తొలగించారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము వెంటనే స్పందించి ప్రభుత్వ భూమికి హద్దురాళ్ళు నిర్ణయించి, అక్రమ దారులపై చర్య తీసుకుని ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు. అనాజిపురం గ్రామంలో మొద్దుంపల్లి పాతకత్వ నుండి అనాజిపురం భోజకుంట మరియు నందనము చెరువులోకి నీళ్లు రావడానికి ఉన్న ఏటి కాలువను కొంతమంది ఆక్రమించుకొని కాలువని పూడ్చినారని అన్నారు. మరోవైపు నక్క బాటలో కాలువ తూము నుండి రైతు పంట పొలాలకు నీళ్లు దగ్గర బోరు వేసి రైతులు తమ పొలాలకు పోకుండా ఇబ్బందుల పాలు చేస్తున్న పరిస్థితి ఉన్నదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ఆ కాలువను పరిశీలన చేసి ఆక్రమ దారుల నుంచి కాల్వ భూమిని తీసుకొని కాలువను వెడల్పు చేసి కాలువ ద్వారా సాగు నీళ్లను అందించాలని, అక్రమంగా వేసిన బోరును పూడ్చాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని నర్సింహ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, కొండ అశోక్, మండల నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, అనాజిపురం శాఖ కార్యదర్శి అబ్దుల్లాపురం వెంకటేష్, ముత్తిరెడ్డిగూడెం శాఖ కార్యదర్శి కూకుట్ల కృష్ణ ,రెండు గ్రామాలకు సంబంధించిన సిపిఎం నాయకులు, రైతులు కడారి కృష్ణ , ఎండి జహంగీర్, ఏదునూరి చంద్రయ్య, నీలం బిక్షపతి, గంగదారి వెంకటేష్, కొండ మహేష్, మెరుగు స్వామి, ఎలగల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా లంబోధరుడికి దీపారాధన ఉత్సవం

**-మాజీ ఎంపీటీసి గోశిక సుమతీ కరుణాకర్**



**చౌటుప్పల్.సెప్టెంబర్ 4. ప్రభాత సూర్య:** శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని చౌటుప్పల్ కాంప్లెక్స్ లో ఏర్పాటుచేసిన గణేష్ కి గురువారం చౌటుప్పల్ కాంప్లెక్స్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులచే సహస్ర దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోశిక సుమతి మాట్లాడుతూ... దీపారాధన అంటే దిక్పాలకులతో పావనం చేసి ,స్వాగతం పలుకుతూ, ధనం, ధాన్యం, దోషాలు లేకుండా, నరగోష ,లేకుండా ఆ భగవంతుడిని, దీపారాధనతో మన వ్యాపార కుటుంబంలో అష్ట ఐశ్వర్యాలు కలగాలని, దేశంలోని ప్రజలు సుభిక్షంగా వర్ధిల్లాలని ప్రార్ధన అని అన్నారు. దీప కాంతి అంధకారాన్ని పారదోలుతుందని, దీపం అంటే భగవంతుడితో సమానమని అన్నారు. అనంతరం మహిళా భక్తుల చేత మహా నైవేద్యం ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ కాంప్లెక్స్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బద్దం లింగారెడ్డి, మస్రం యాదగిరి, గోలి యాదగిరి, విష్ణు, మల్లేష్, గోశిక పాండు, గోశిక స్వామి,లక్ష్మయ్య, సత్యనారాయణ, జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గణేష్ గల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.....



**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ డివిజన్ పరిదిలో లో నీ గుట్టల బేగంపేట్ లో నీ శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రజాప్రనిధులు స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు.ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, బిక్షపతి ముదిరాజ్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ గణేష యూత్ అసోసియేషన్ ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ యూత్ అసోసియేషన్ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడికి సామూహిక కుంకుమార్చన



**చౌటుప్పల్.సెప్టెంబర్ 4. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో రాణి రుద్రమదేవి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన మట్టి వినాయకుడికి గురువారం ఘనంగా నవరాత్రి పూజలు నిర్వహించారు. లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక హెూమం నిర్వహించారు. మహిళలు సామూహికంగా విఘ్నేశ్వరుడికి కుంకుమార్చన చేశారు. భ్రమరాంబిక భజన మండలి మహిళా కళాకారులచే ఆధ్యాత్మిక భక్తి కీర్తనలతో గణేశుడి ఎదుట భజనలు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య, కార్యదర్శి డాక్టర్ ఉజ్జని మంజుల, రాణి రుద్రమ వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు పోలోజు శ్రీలత, మాజీ ఉప సర్పంచ్ పాక పద్మ,ఉత్సవ కమిటీ సభ్యులు చోల్లేటి పద్మ, పుట్టా రమణ, కొత్తగొల్ల అరుణ, బొజ్జ రజని, సంగం ప్రశాంతి, చందక దేవి, వీర గంటి మేఘన, వినుకొండ సరిత, విశ్వనాథుల అలివేలు, పోలోజు వాణి, వాణి, అవ్వరు రామేశ్వరి, నీరజ, ఉమా, సంధ్య, శమంతకమణి, పోలోజు జయ, దేవరకొండ అరుణ, వాణిశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రాం రెడ్డిపల్లి,, పాఠశాలలో ఘనంగా గురు పూజోత్సవం

**-జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర**
**పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజయ్య**




**మర్రిగూడసెప్టెంబర్ 04. ప్రభాత సూర్య:** మర్రిగూడ మండలంలోని రామ్ రెడ్డి పల్లి పాఠశాల లో సెప్టెంబర్ 5 శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినంను పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలకు సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గురుపూజోత్సవంలో భాగంగా పాఠశాల విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ వేషధారణలు తిలకించారు అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి ఉపాధ్యాయుల ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలియజేశారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాడిగ అంజయ్య, లెంకలపల్లి వెంకటేశ్వర్లు, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు

# విద్యార్థులను తీర్చిదిద్దటంలో గురువుల కృషి వెలకట్టలేనిది

**శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు**

**చౌటుప్పల్.సెప్టెంబర్ 4. ప్రభాత సూర్య :** విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ఈ గురువారావు పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఈ గురువారావు మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గొప్పతనాన్ని, ఆయన ఉపాధ్యాయులకు ఎందుకు మార్గదర్శకులు అనే దానిపై విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదన్నారు. ఒక వ్యక్తి, సమాజ, జాతి నడకకు, నడతకు, పురోగతికి, శ్రేయసుకు గురువు మార్గదర్శనం తప్పనిసరిని విద్యార్థులకు తెలిపారు. గురువు మన జీవితానికి వెలుగు చూపే దీపం లాంటివాడని అటువంటి ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించాలని సూచించారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులందరికీ



ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మండల విద్యాధికారిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్వేతా బౌన్స్, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజిఎం టి సతీష్, ఆర్ ఐ వెంకటేశ్వర్లు, డీన్ దుర్గాప్రసాద్, ఏవో గోపీచంద్, ప్రైమరీ స్కూల్ ఇంచార్జ్ పరమేశ్వరి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# చందన పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**విద్యార్థులను తీూర్చిదిద్దటంలో గురువుల కృషి వెలకట్టలేనిది**

**ప్రధానోపాధ్యాయురాలు అవ్వారు రామేశ్వరి**

**చౌటుప్పల్.సెప్టెంబర్ 4. ప్రభాత సూర్య :** విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని చందన పాఠశాల ప్రధానోపాధ్యాయులు అవ్వారు రామేశ్వరి అన్నారు. పట్టణ కేంద్రంలోని చందన పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ముందస్తుగా పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అవ్వారు రామేశ్వరి మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గొప్పతనాన్ని, ఆయన ఉపాధ్యాయులకు ఎందుకు మార్గదర్శకులు అనే దానిపై విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకోని ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తీసుకురావాలన్నారు. ఒక వ్యక్తి, సమాజ, జాతి నడకకు, నడతకు, పురోగతికి, శ్రేయసుకు గురువు మార్గదర్శనం తప్పనిసరిని విద్యార్థులకు తెలిపారు. గురువు మన జీవితానికి వెలుగు చూపే దీపం లాంటివాడని అటువంటి ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించాలని సూచించారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు అవ్వారు రామేశ్వరి ని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు.




ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అవ్వారు రామేశ్వరి, ఉపాధ్యాయులు స్వప్న, పద్మ, జి స్వప్న, అర్చన, కవిత, జగదీశ్వరి, దీప, లావణ్య, ఉషారాణి, తేజశ్రీ, సంధ్యారాణి విద్యార్థులు పాల్గొన్నారు.

# గణపతిని ఆరాధించడం వలన సకల శుభాలతో పాటు అష్టైశ్వర్యాలు కలుగుతాయి

**కూకట్ పల్లి సీఐ వెంకట సుబ్బారావు**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 04 (ప్రభాత సూర్య) :**విగ్నేశ్వరుడిని ఆరాధించడం వలన సకల శుభాలతో పాటు అష్టైశ్వర్యాలు కలుగుతాయని కూకట్ పల్లి సీఐ వెంకటసుబ్బయ్య అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన భారీ గణనాథుని కూకట్ పల్లి సిఐ వెంకటసుబ్బయ్య, ఎస్సై చంద్రశేఖర్, డిఐ వెంకటేశం ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ రోజా దేవి రంగారావు వినాయకుడి దగ్గర ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం చేసిన చిన్నారులకు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మెమొంటోలు అవార్డులు ప్రధానం



చేశారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు, పిల్లలు, కమిటీ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి,



జలంధర్ రెడ్డి, శ్రీనివాసరావు, జి ప్రసాద్, భార్గవ్, అశ్విత్ సాయి, నందు, రోహిత్, అనిల్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ వేలంపాటలో లడ్డును కైవాసం చేసుకున్న జోగిపేట కుటుంబ సభ్యులు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 04 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లీ సర్కిల్ శంషిగూడ ఇంద్ర నగర్ కాలనీలో గురువారం శ్రీ వర సిద్ధి వినాయక వివేకానంద యూత్ ఇంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిది రోజుల గణేష్ నవరాత్రి వేడుకల్ల విశేష పూజలు అందుకున్న శ్రీ వరసిద్ధి వినాయక లడ్డు వేలం పాటలో మూడు లక్షల యాభై వేల రూపాయలకు( 350000) జోగుపేట సత్యనారాయణ, జోగుపేట రాము జోగుపేట జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు లడ్డును పాటలో కైవసం చేసుకున్నారు. అనంతరం గణేష్ నిమజ్జనం శోభయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. గణేష్ నిమజ్జనం వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంగళ హారతులతో అట పాటలతో చిన్నారుల నృత్యాలతో ఇంద్ర నగర్ కాలనీ లో



బ్యాండ్ మేళా ల తో ఊరేగింపు కొనసాగించారు ఈ కార్యక్రమంలో ఇంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు,



వివేకానంద యూత్ సభ్యులు, మహిళలు చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పవనపుత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుడి నిమజ్జనం

**లెనిన్ నగర్ కాలనీ లో లడ్డు వేలంపాట**

**రూ.41,500 లకు దక్కించుకున్న దేవ్ శ్రీనివాస్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 04 (ప్రభాత సూర్య) :**కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గాజుల రామారావు డివిజన్ లెనిన్ నగర్ రోడ్ నెంబర్ 4 ఏ బ్లాక్ లో పవనపుత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన భారీ గణపతి లడ్డు వేలం పాట గురువారం అట్టహాసంగా జరిగింది. పోటాపోటీగా జరిగిన వేలంపాటలో దేవ్ శ్రీనివాస్ చారి రూ. 41500 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నాడు. అనంతరం డప్పు వాయిద్యాలతో, హారతి ఇంటి వరకు కాలనీ ప్రజలందరూ గణపతి పప్పా మోరియా అంటూ వారి ఇంటి వరకు సాగనంపారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని పవనపుత్ర అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు, యూత్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల యాకుబ్ రెడ్డి, ముతోజు రాజు, తలకొండ సురేష్, కోడే బోయిన దుర్గాప్రసాద్, రాజేష్, కొండయ్య, వినుకొండ శరత్, సొంటి రెడ్డి దామోదర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నవీన్ రెడ్డి, జ్ఞానేశ్వర్, కుల్ల రాజు, ఎండి బలిక్, పవనపుత్ర కమిటీ సభ్యులు కోడబోయిన హర్ష వర్ధన్, అరుణ్, శశివర్ధన్, చంద్రశేఖర్, హేమంత్, ధనుంజయ్, యశ్వంత్, భరత్, రాహుల్, సిద్ధార్థ, ఫణింద్ర, పవన్, చందు, ఆదిత్య, శివకృష్ణ, నితిన్ కృష్ణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని



విజయవంతం చేశారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు...

**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ డివిజన్ పరిదిలో లో నీ గుట్టల బేగంపేట్ లో



నీ శ్రీ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రజాప్రనిధులు స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు. ముఖ్య అతిథిగా శేర్లింగంపల్లి నియోజకవర్గం ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్, మాదాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ నాగేష్ నాయక్ తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్లీకా గణేష్ యూత్ అసోసియేషన్ ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గల్లి కా గణేష్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మహారాజ్ కు ప్రత్యేక పూజలు పాల్గొన్న మారబోయిన రవి యాదవ్...



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గోపినగర్ లో పలు గణేష్ మండపాలకి లచ్చగొని శ్రీకాంత్ యాదవ్ మరియు రమేష్ పిలుపు మేరకు ముఖ్య అతిథిగా మారబోయిన రవి యాదవ్ విచ్చేశారు. మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవం అంటేనే కుల మత బేధాలు లేకుండా చిన్న పెద్దా అని తేడా లేకుండా అందరూ కలిసి చేసుకునే పండగనే ఈ గణేష్ ఉత్సవం. ఏ మంచి పని మొదలుపెట్టిన ముందుగా పూజ ఇచ్చేది గణనాథునికే అని చెప్పకు వచ్చారు. భారతదేశంలోని ప్రజలు అంతా సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో అందరూ బాగుండాలని బొజ్జ గణపయ్యకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన ప్రసాదంలో మారబోయిన రవి యాదవ్ పాలుగోన్ని దగ్గరుండి వంట మార్పు అన్నీ చూసుకొని తన చేతులతోనే వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కే ఎన్ రాములు, మల్లేష్ ముదిరాజ్, గడ్డం శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్,శ్రీశైలం యాదవ్,గంగాధర్ గౌడ్,ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నవీన్ గౌడ్, మున్నా, సాయి నందన్ ముదిరాజ్,పవన్,స్వామినాథ్,శంకర్,రమేష్,మూర్గేష్,రఘు, కుమార్, శ్రీకాంత్, శ్రీను, సాయి, పునీత, ఏశ్వంత్, పవన్, హర్ష, సాయి కిరణ్, దివ్య, పద్మ, జ్యోతి,భాగ్య, లలిత గోపి నగర్ వాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఘనంగా గణేశుడి నవరాత్రి వేడుకలు..


**ప్రత్యేక పూజలు చేసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్...**



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి డివిజన్ లోని పలు వినాయక మండపాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించిన అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాలను కార్పొరేటర్ ప్రారంభించారు.

## తెలంగాణ జన సమితి పార్టీలో చేరిన ఉద్యమ నేత కొరివి ధనలక్ష్మి

**-ఖమ్మం జిల్లాలో రోజురోజుకు విస్తరిస్తున్న టీజేఎస్ పార్టీ**




**ఖమ్మం(సూర్య ప్రతినిధి)** టిఆర్ఎస్ ఖమ్మం జిల్లా మహిళా సెల్ మాజీ అధ్యక్షురాలు కొరివి ధనలక్ష్మి ఆ పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ జన సమితి వ్యవస్థాప అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం సార్ సమక్షంలో ఖమ్మం జిల్లా తెలంగాణ జన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు రాజేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ జన సమితి పార్టీలో చేరారు. ఆమెను ప్రొఫెసర్ కోదండరాం సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఖమ్మం జిల్లాలో పలు ప్రాంతాలు పర్యటించి జిల్లాలో పలువురు మహిళలను పార్టీలో చేర్పించి పార్టీ యొక్క అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ పదాధికారులు అందరూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు పి వినయ్ కుమార్ రమేష్ తదితరులు ఉన్నారు.



# అఖండ-2 మూవీ రిలీజ్ డేట్.. ఆ రోజైనా వచ్చేనా?

బాలకృష్ణ- బోయపాటి కాంబోలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'అఖండ'. 2021 డిసెంబరులో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీంతో ఈ మూవీకి సీక్వెల్‌గా అఖండ-2ను తెరకెక్కిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 10న బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా టీజర్ కూడా రిలీజ్ చేశారు. అయితే ఈ నెలలోనే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. పవన్ కల్యాణ్ హీరోగా వస్తోన్న ఓజీ ?సినిమా కోసం అఖండ-2ను వాయిదా వేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో బాలయ్య సినిమా ఇంకెప్పుడా అని ఆడియన్స్ ఎదురు చూస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఉంటుందా లేదా అంతకుముందే డిసెంబర్‌లోనే రానుందా అని ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు తెగ కన్ఫ్యూజ్ అవుతున్నారు. అఖండ-2 విడుదల తేదీని ఇప్పటివరకు మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా నందమూరి బాలకృష్ణ ఈ మూవీ రిలీజ్ డేట్‌పై హింట్ ఇచ్చేశారు. డిసెంబర్ తొలివారంలోనే అఖండ-2 రానుందని చెప్పేశారు. అయితే విడుదల తేదీని మాత్రం వెల్లడించలేదు. ఈ లెక్కన డిసెంబర్ 5న శుక్రవారం కావడంతో అదే రోజు రిలీజ్ కావొచ్చని టాలీవుడ్ ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఆ రోజైనా రిలీజవుతుందా? లేదంటే సంక్రాంతికి పోస్ట్‌పోన్ అవుతుందా? అనే విషయంపై మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# గుడ్ న్యూస్ చెప్పిన కీర్తి సురేష్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకుంది. అయినప్పటికీ ఇండస్ట్రీకి దూరం అవకుండా.. వరుస చిత్రాల్లో నటిస్తోంది. కానీ గత కొద్ది కాలంగా విజయాన్ని అందుకోలేకపోతుంది. ఇక ఇటీవల కీర్తి ఉప్పుకప్పురంబు, రివాల్వర్ రీటా చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది. ఈ రెండు బాక్సాఫీసు వద్ద హిట్ సాధించలేకపోయాయి. ఇక 2023 నుంచి హిట్ కోసం తాపత్రయపడుతున్న కీర్తి సురేష్‌కు నిరాశనే మిగులుతోంది. పెళ్లైనప్పటి నుంచి అమ్మడుకి లక్ పెద్దగా కలిసిరావడం లేదు. అయినా హిట్, ఫ్లాప్ అని ఆలోచించకుండా వరుస ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తోంది. తాజాగా, కీర్తి సురేష్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ గుడ్ న్యూస్ ప్రకటించింది. తాను చేస్తున్న సినిమాకు సంబంధించిన విషయాలను వెల్లడించింది. ఇందులో కోలీవుడ్ కీర్తి సురేష్, సంచలన దర్శకుడు మిస్కిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు ప్రవీణ్ విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'ప్రొడక్షన్-9' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని డ్రమ్‌స్టిక్ ప్రొడక్షన్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అలాగే త్వరలోనే షూటింగ్ కూడా స్టార్ట్ కాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. "మేము ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. ప్రొడక్షన్-9 ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది" అనే క్యాప్షన్ జత చేసింది. అలాగే మూవీ టీమ్‌తో తీసుకున్న ఫొటోలను షేర్ చేసింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు సూపర్ ఎగ్జైటెడ్.. అంటూ కంగ్రాట్స్ చెబుతున్నారు.



# ఈ యూనిఫాం వేసుకున్న ప్రతీ ఒక్కడికి అందరూ ఫ్యామిలీనే రా..

## సస్పెన్స్‌గా అథర్వ మురళి టన్నెల్ ట్రైలర్

గద్దల కొండ గణేశ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యాడు కోలీవుడ్ యాక్టర్ అథర్వ మురళి తెలుగులో సినిమాలో మెరిసిన ఈ టాలెంటెడ్ యాక్టర్ టెన్నెల్ సినిమా కోసం ఖాకీ చొక్కా వేసుకున్నాడు. ఈ సారి యాక్షన్ ప్యాక్‌డ్ థ్రిల్లింగ్ కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. రవీంద్ర మాధవ దర్శకత్వంలో అథర్వ మురళి నటించిన తమిళ చిత్రం తెలుగులో టన్నెల్ పేరుతో విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే స్పెషల్ పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ మూవీని తెలుగులో సెప్టెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. తాజాగా మేకర్స్ తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. పోలీసుల బృందం సైరన్ల మోతతో టన్నెల్‌లోకి ప్రవేశించగా.. ఓ వ్యక్తి వారికి ఎదురుగా వస్తాడు. ఎవడ్రా నువ్వు అని పోలీసులు అడిగితే ఆ వ్యక్తి పిస్తోల్‌తో ఫైరింగ్ చేసే సన్నివేశాలతో షురూ అయింది ట్రైలర్. అనుమానాస్పద హత్యలు, వాటిని అథర్వ మురళి అండ్ పోలీసుల టీం ఎలా చేధించారనే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్‌తో హింట్ ఇచ్చాడు డైరెక్టర్. ఈ యూనిఫాం వేసుకున్న ప్రతీ ఒక్కడికి అందరు ఫ్యామిలీనే రా అంటూ అథర్వ మురళి చెప్తున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. క్రూరమైన హత్యల వెనుకున్న సైకోను పట్టుకునే పోలీసాఫీసర్‌గా అథర్వ మురళి కనిపించనున్నట్టు ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. ఇంతకీ అతడు ఆ సైకోను పట్టుకున్నాడా..? లేదా..? అనే సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రంలో అశ్విన్ కాకుమాను విలన్‌గా నటిస్తున్నాడు. ఈ మూవీని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా ఏ రాజు నాయక్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రానికి జస్టిన్ ప్రభాకరన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కొణిదెల హీరోయిన్‌గా నటిస్తోంది

# నెట్‌ఫ్లిక్స్‌లో శ్రద్ధా శ్రీనాథ్ కొత్త వెబ్ సిరీస్.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!



శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ ది గేమ్: యూ నెవర్ ప్లే అలోన్ ఈ సిరీస్‌కు రాజేష్ ఎం. సెల్వా దర్శకత్వం వహిస్తుండగా.. సంతోష్ ప్రతాప్, చాందిని, శ్యామ హరిణి, బాలా హసన్, సుభాష్ సెల్వం, వివియా సంత, ధీరజ్, మరియు హేమ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్ నిర్మిస్తుంది. తాజాగా ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ వెబ్ సిరీస్ అక్టోబర్ 2, 2025 నుంచి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సిరీస్ ఒక గేమ్ డెవలపర్ జీవితం చుట్టూ తిరుగుతుంది. శ్రద్ధా శ్రీనాథ్ పోషించిన ఈ పాత్ర తనపై జరిగిన ఒక సామూహిక దాడి వెనుక ఉన్నవారిని కనిపెట్టడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో ఆమెకు డిజిటల్ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను, రహస్యాలను ఈ థ్రిల్లర్ సిరీస్ చూపిస్తుంది. ఈ సిరీస్ థ్రిల్లర్‌గా మాత్రమే కాకుండా, మనం నివసించే డిజిటల్ ప్రపంచం, రహస్యాలు, మరియు మారుతున్న సంబంధాలను కూడా ప్రతిబింబిస్తుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.